సోమవారం
02-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 191
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కఠిన సవాళ్ల ముంగిట చైనా

తమ దేశం కోవిడ్ కారణంగా కఠిన సవాళ్లను ఎదుర్కొంటోందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా సంక్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటోందని చెప్పారు. అన్ని సమస్యలు, సవాళ్లను ఐక్యంగా అధిగమించాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

2లో

ఏపీ అభివృద్ధి ఏదీ?

- మూడున్నరేళ్లుగా జగన్ కాలయాపన
- నిత్యం మోదీకి జపం
- విభజన హామీలపై నిర్లక్ష్యం
- పక్క రాష్ట్రాలకు పరిశ్రమలు
- పడకేసిన నీటిపారుదల ప్రాజెక్టులు
- ఉద్యోగ, ఉపాధి కల్పనలో దగా
- కొత్త ఏడాదిలో మెగా డీఎస్సీపై ఆశలు
- పింఛన్లు, రేషన్‌కార్డుల కుదింపుతో ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, విభజన హామీలు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఈ ఏడాదిలోనైనా జగన్ ప్రభుత్వం అడుగు వేస్తుందా?, లేదా? అనేవీ ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. ఇవి జగన్‌కు సవాళ్లుగానే మారుతున్నాయి. మూడున్నరేళ్ల జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి బెత్తెడు ముందుకెళ్లలేదు. పరిశ్రమలు, నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతీ లేదు. ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోవడం వెరసి రాష్ట్రంలో ఒక్కటీ నిర్మించలేదు. ప్రభుత్వ ఉద్యోగాలు, పరిశ్రమల్లో ఉద్యోగ కల్పన కనుమరుగైంది. సీఎం జగన్ దిల్లీకి ఎన్ని సార్లు వెళ్లినా, వినతులు సమర్పించినా ఫలితం లేదు. ఆ వినతులపై కేంద్రమూ స్పందించడం లేదు. అసలు కేంద్రానికి సీఎం ఏయే వినతులిస్తున్నారేదీ మీడియా ముఖంగా చెప్పడం లేదని, రాష్ట్ర ప్రజలకూ వివరించడం లేదంటూ ప్రతిపక్షాలు నిలదీస్తున్నా జగన్ స్పందించడం లేదు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకుగాను ప్రతిపక్షాలను ఇంత వరకు దిల్లీకి తీసుకెళ్లలేదు. వారికి రాష్ట్రంలో ఏ ఒక్కరికీ అపాయింట్‌మెంట్ ఇచ్చిన సందర్భాలు లేవు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎటువంటి సాయం లేకపోయినా, అటు జగన్ మాత్రం కేంద్రానికి అన్ని విధాలా వత్తాసు పలుకుతున్నారు. చట్టసభల్లో కేంద్రం తీసుకొచ్చిన రైతాంగ, కార్మిక వ్యతిరేక, అలాగే ప్రైవేటీకరణ కోసం తీసుకొచ్చిన బిల్లులకు వైసీపీ ఎంపీలు మద్దతు తెలుపుతున్నారు. పరోక్షంగా ప్రధాని నరేంద్ర మోదీకీ, అమిత్ షాకు మద్దతిస్తున్నారు. దీనివల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రతిపక్షాల సూచనలను, రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని ఖాతరు చేయకుండా... ఒంటెద్దు పోకడలతో జగన్ పాలన ఉంది. రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలో పయనిస్తోందంటూ ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. జగన్ ఏకపక్ష పాలనతోనే రాష్ట్ర పరిస్థితి దిగజారిందని, సీఎం కేవలం మీట నొక్కే వారిగానే పరిమితమై పోతున్నారంటూ మండిపడుతున్నాయి. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం ఇంతవరకూ పూర్తి చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లనూ లబ్ధిదారులకు కేటాయించలేదు. ప్రతి నెలా వేలాది మంది పేదలకు చెందిన రేషన్ కార్డులు, పింఛన్లలో కోత విధించడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు ఒక్కటీ పూర్తి కాలేదు. నాడు వైఎస్ఆర్ జలయజ్ఞానికి ప్రాధాన్యత ఇవ్వగా, సీఎం జగన్ మాత్రం వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి.

జాబ్ క్యాలెండరులో జాప్యం

ప్రతి ఏట నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండరు ఇస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి, నిట్టనిలువునా ముంచేశారు. కేవలం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసి, ఆ తర్వాత మిగిలిన విభాగాల ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం గాలికొదిలేసింది. విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాల ఉద్యమాల ఫలితంగా ఎట్టకేలకు మూడున్నరేళ్ల తర్వాత పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో వయోపరిమితి పెంచలేదు. దానిపైనా విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యమించడంతో ప్రభుత్వం దిగివచ్చి రెండేళ్ల వయోపరిమితిని పెంచింది. దీంతో వేలాది మంది ఉద్యోగాలకు అవకాశం లభించింది. మూడున్నరేళ్ల నుంచి డీఎస్సీ పోస్టులు భర్తీ చేయలేదు. దీంతో లక్షన్నర మంది అభ్యర్థులకు వయస్సు

- మిగతా 2 లో

మళ్లీ తొక్కిసలాట

ముగ్గురి మృతి... 13 మందికి గాయాలు

గుంటూరు చంద్రన్న కానుక పంపిణీలో అపశ్రుతి

- మాదే నైతిక బాధ్యత: ఉయ్యూరు ఫౌండేషన్
- మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్:
గుంటూరులోని వికాస్ నగర్‌లో ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ జనతా వస్త్రాలు-చంద్రన్న సంక్రాంతి కానుక కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. చంద్రబాబు సభ ముగిసి ఆయన

- మిగతా 2 లో

ఎన్నికలకు వేళాయె

- సిద్ధమవుతున్న అసెంబ్లీ బరులు
- పోరుకు కీలక రాష్ట్రాలు సంసిద్ధం
- 2023లోనే లోక్‌సభ సెమీఫైనల్స్

న్యూదిల్లీ:
2023 సంవత్సరం ఎన్నికల వత్సరంగా పరిణమి స్తోంది. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజాస్థాన్, చత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి కీలక రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ అసెంబ్లీలకు ఎన్నికలు ఫిబ్రవరి-మార్చిలో జరుగుతాయి. మార్చితో ఈ అసెంబ్లీల పదవీకాలం ముగియనుంది. త్రిపురలో బీజేపీ, నాగాలాండ్‌లో నేషన లిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ, మేఘాలయలో నేషనల్స్ పీపుల్స్ పార్టీ అధికారంలో ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. ఈమేరకు డిసెంబరులో ఎన్నికల కమిషన్ సంకేతాలిచ్చింది. 224 సభ్యుల కర్ణాటక అసెంబ్లీ గడవు మే 24తో పూర్తి కానున్నది. దీంతో ఏప్రిల్ చివరిలో లేక మే ఆరంభంలో ఈ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. మిజో రం, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు డిసెంబరులో మొదలై 2024 జనవరి వరకు కొనసాగవచ్చు. 40 మంది సభ్యులున్న మిజోరం అసెంబ్లీ గడువు 2023, డిసెంబరు 17తో ముగుస్తుంది. అలాగే, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్

- మిగతా 2 లో

మోదీ పాలనలో

నిరుద్యోగం పైపైకి

- 16 నెలల్లో అత్యధికం
- డిసెంబరులో 8.30 శాతానికి చేరిక

న్యూదిల్లీ:
కేంద్రంలోని మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరింది. గత 16 నెలల కాలంలో అత్యధికంగా డిసెంబరులో 8.30 శాతానికి చేరింది. అంతకు ముందు నెలలో ఇది 8 శాతంగా ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ఆదివారం తెలిపింది. పట్టణ నిరుద్యోగిత రేటు డిసెంబరులో అంతకుముందు నెలలో 8.96 శాతం నుంచి 10.09 శాతానికి పెరిగింది. అయితే గ్రామీణ నిరుద్యోగం రేటు 7.55 శాతం నుంచి 7.44 శాతానికి పడిపోయిందని గణాంకాలు పేర్కొన్నాయి. కాగా అధిక ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం, ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశించే లక్షలాది మంది యువకులకు ఉద్యోగాలు కల్పించడం 2024లో జరిగే జాతీయ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనకు అతిపెద్ద సవాలుగా ఉందనేది సుస్పష్టం. బీజేపీ విభజన రాజకీయాలు, అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలపై ప్రజల అభిప్రాయాన్ని సమీకరించేందుకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ సెప్టెంబరులో దక్షిణ నగరం కన్యాకుమారి నుంచి జమ్ముకశ్మీర్ ప్రాంతంలోని శ్రీనగర్ వరకు ఐదు నెలల పాటు 'భారత్ జోడో యాత్ర'ను ప్రారంభించింది. 'భారతదేశం జీడీపీ వృద్ధిపై ఒకే దృష్టి నుంచి ఉపాధి, యువత నైపుణ్యం, ఎగుమతుల అవకాశాలతో ఉత్పత్తి సామర్థ్యాలను సృష్టించడం వంటి వృద్ధికి వెళ్లాలి' అని పార్టీ 3,500 కిలోమీటర్ల పాదయాత్రకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ

- మిగతా 2 లో

నోట్ల రద్దుపై నేడు సుప్రీం తీర్పు

మరో రెండు కీలక కేసుల విచారణ

న్యూదిల్లీ:
నోట్ల రద్దుపై సుప్రీంకోర్టులో సోమవారం తీర్పు వెలువడనున్నది. అలాగే ఎన్నికల సంస్కరణలు, బలవంతపు మత మార్పిళ్ల అంశాలు కూడా విచారణకు రానున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2016లో రూ.1000, రూ.500 కరెన్సీ నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించనుంది. జనవరి 4న పదవీ విరమణ చేయనున్న జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం జనవరి 2న ఈ అంశంపై తీర్పును వెలువరించే అవకాశం ఉంది. శీతాకాల విరామం తర్వాత సుప్రీంకోర్టు తిరిగి తెరుచుకుంటుంది. సోమవారం నాటి అత్యున్నత న్యాయస్థానం జాబితా ప్రకారం, ఈ విషయంలో రెండు వేర్వేరు తీర్పులు ఉంటాయి. వీటిని న్యాయమూర్తులు

- మిగతా 2 లో

డిసెంబరులో 15 శాతం పెరిగిన

జీఎస్టీ వసూళ్లు

వస్తువులు-సేవల పన్ను (జీఎస్టీ) 2022 డిసెంబరులో 15 శాతం పెరిగి రూ.1.49 లక్షలకోట్లకుపైగా నమోదైంది. ఉత్పత్తి, వినియోగ డిమాండు మెరుగుదలను ఈ పెంపు సూచిస్తున్నది. వరుసగా పదో నెలలో రూ.1.40లక్షల కోట్లకుపైగా పన్ను ఆదాయం వచ్చింది.

8లో

ఇదీ లోకం!

నీకో శుభవార్త ఏమిటంటే నీ పెంఛన్ పెరిగింది, అలాగే దుర్వార్త ఏమిటంటే నీ పేరు పింఛన్ జాబితాలోంచి ఎగిరిపోయింది.

ఐదేళ్లలో బీసీ జడ్జీలు 15 శాతమే

- న్యాయమూర్తుల నియామకంలో సామాజిక సమతుల్యం లేదు
- పార్లమెంటరీ ప్యానల్‌కు న్యాయ శాఖ నివేదన

న్యూదిల్లీ:
దేశ న్యాయ వ్యవస్థలో వెనుకబడిన వర్గాలతో పాటు మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సముచిత ప్రాతినిధ్యం ఉండటం లేదని న్యాయశాఖ వ్యాఖ్యానించింది. ఐదేళ్లలో జడ్జీలుగా నియమితులైన బీసీలు 15శాతమే అని పార్లమెంటు స్థాయి సంఘానికి ప్రజెంటేషన్ రూపేణ నివేదించింది. కొలీజియం వ్యవస్థ 30ఏళ్లుగా జడ్జీల నియామకాలను చేపడుతుండగా నేటికీ నియామకాల్లో సామాజిక వైవిధ్యత కానరాదని, తమ సభ్యుల్లో ఆయా వర్గీయులు ఉంటారన్న జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చెల్లనిదిగా ప్రకటించిందని న్యాయశాఖ తెలిపింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాల కోసం ప్రతిపాదనలు చేసే బాధ్యత కొలీజియానిది కాబట్టి ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలకు నియామకాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సినదీ అదే వ్యవస్థ అని నొక్కిచెప్పింది. కొలీజియం సిఫార్సు చేసిన వారిని మాత్రమే సుప్రీంకోర్టు-హైకోర్టుల జడ్జీలుగా కేంద్రప్రభుత్వం నియమించగలదంటూ వివరణాత్మక

ప్రెజెంటేషన్‌ను బీజేపీ సీనియర్ నేత సుశీల్‌మోదీ అధ్యక్షత వహించే సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయం-చట్టం స్థాయి సంఘానికి న్యాయశాఖ ఇచ్చింది. 'రాజ్యాంగబద్ధ న్యాయస్థానాల్లో

- మిగతా 2 లో

మహిళలపై పెరిగిన నేరాలు

- ఏడాదిలో 31వేల ఫిర్యాదులు
- 2014 తరువాత ఇదే అత్యధికం
- జాతీయ మహిళా కమిషన్ డేటాతో వెల్లడి

న్యూదిల్లీ:
మహిళలపై నేరాలకు సంబంధించి 2022లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)కు 31వేల ఫిర్యాదులు అందాయి. 2014 తర్వాత ఇన్ని ఫిర్యాదులు రాలేదు. 2021లో 30,864 ఫిర్యాదులు రాగా 2022లో వాటి సంఖ్య 30,957కు పెరిగింది. వీటిలో మహిళలపై మానసిక వేధింపులు-గౌరవప్రద జీవనానికి సంబంధించినవి 9,710 ఫిర్యాదులు ఉన్నాయి. గృహహింసపై 6,970, వరకట్న వేధింపులపై 4,600 ఫిర్యాదులు వచ్చినట్లు ఎన్‌సీడబ్ల్యూ డేటా చెబుతోంది. ఉత్తరప్రదేశ్ నుంచి 16,872 అంటే 54.5శాతం ఫిర్యాదులు రాగా దిల్లీలో 3,004 ఫిర్యాదులు నమోదయ్యాయి. అలాగే మహారాష్ట్రలో 1,381, బీహార్‌లో 1,368, హరియాణాలో 1,362 చొప్పున ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్ నుంచే అత్యధిక ఫిర్యాదులు రాగా అక్కడ మహిళలకు స్వేచ్ఛ-గౌరవప్రదమైన జీవనం కష్టసాధ్యం. అలాగే గృహహింస ఎక్కువ. కాగా 2014 తర్వాత భారీ సంఖ్యలో ఫిర్యాదులు నమోదు కాలేదు. ఆ సంవత్సరం వచ్చిన మొత్తం 33,906 ఫిర్యాదులలో మహిళలపై లైంగిక దాడులకు సంబంధించి 2,523 వినతులు ఉండగా అత్యాచారం, అత్యాచార యత్నాలపై 1,701, మహిళలపై పోలీసు జులుంకు సంబంధించి 1,623, సైబర్ నేరాలపై 924 ఫిర్యాదులు ఉన్నట్లు డేటా తెలిపింది.

'ఉక్రెయిన్ విజయమే నేను కోరేది'

నూతన వత్సర సందేశంలో జెలెన్‌స్కీ

కీవ్: కొత్త సంవత్సరంలో ఉక్రెయిన్ కోసం తాను కోరుకునేది 'విజయం' ఒక్కటే అని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ అన్నారు. విజయం సిద్ధించే వరకు చివరి రక్తపు బొట్టు వరకు దేశం కోసం పోరాటం చేస్తామని కొత్త సంవత్సరం సందర్భంగా ఇచ్చిన సందేశంలో భావోద్వేగంగా మాట్లాడారు. దాదాపు ఏడాదిగా తమ దేశంపై జరుగుతున్న దాడులను ప్రస్తావించారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి 12 గంటలకూ ప్రపంచం మొత్తం కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకగా ఉక్రెయిన్ మాత్రం కర్ఫ్యూ నీడలో ఉండిపోయింది. జెలెన్‌స్కీ జాతినుద్దేశించి మాట్లాడుతూ కొత్త సంవత్సరం సందర్భంగా ఉక్రెయిన్ కోసం నా కోరిక ఒక్కటే.అదే మన విజయం' అని అన్నారు. 'మనల్ని ఏదైనా భయపెట్టగలదా? ఎవరైనా మనల్ని ఆపగలరా? లేదు. ఎందుకంటే మనం ఐక్యంగా ఉన్నాం. అదే మన బలం. అందుకోసమే మనం పోరాడుతున్నది. మనమంతా ఒకరికి ఒకరం..' అని చెప్పారు. యుద్ధ సైనికులతో పాటు రష్యా దాడులను తిప్పి గొట్టిన సామాన్యులకూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మనలో ప్రతి ఒక్కడిలో యోధుడు ఉన్నాడు. మనల్ని మనమే రక్షించుకోవాలి' అని అన్నారు. ఉక్రెయిన్ ప్రపంచాన్ని మార్చి వేసిందని జెలెన్‌స్కీ తెలిపారు. మిగతా ప్రపంచాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ 'మమ్మల్ని లొంగి పోమన్నారు. మేము ప్రతిఘటించాలని నిర్ణయించుకున్నాం. రాజీ పడమన్నారు. యూరోపియన్ యూనియన్, నాటోలో చేరుతున్నాం' అని అన్నారు. 2023లోనూ పోరాడేందుకు ఉక్రెయిన్ వెనుకాడబోదని తేల్చిచెప్పారు. కాగా, ప్రపంచ దేశాలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న వేళలోనూ ఉక్రెయిన్ క్షిపణుల దాడులను ఎదుర్కొన్నది. రష్యా- ఉక్రెయిన్‌కు మధ్య యుద్ధం పరిష్కారానికి అనేక దేశాలు యత్నిస్తున్నా ఫలితం దక్కడం లేదు. శాంతి చర్చలకు సిద్ధమని రెండు దేశాలు తమదైన శైలిలో చెబుతున్నా ఎవ్వరూ వెనక్కుతగ్గకపోవడంతో యుద్ధం ఇంకా కొనసాగుతోంది. కాగా ఉక్రెయిన్‌కు అమెరికా, బ్రిటన్ సహా పాశ్చాత్య దేశాలు అండగా నిలుస్తూ అవసరమైన ఆర్థిక-అస్త్ర సాయాన్ని క్రమంగా అందిస్తున్న విషయం విదితమే.

కఠిన సవాళ్ల ముంగిట చైనా

నూతన సంవత్సర సందేశంలో జిన్‌పింగ్

బీజింగ్: తమ దేశం కోవిడ్ కారణంగా కఠిన సవాళ్లను ఎదుర్కొంటోందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా సంక్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటోందని చెప్పారు. అన్ని సమస్యలు, సవాళ్లను ఐక్యంగా అధిగమించాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. జిన్‌పింగ్ కొత్త సంవత్సరం సందర్భంగా జాతినిద్దేశించి టీవీ మాధ్యమంగా ప్రసంగించారు. దేశంలో కోవిడ్ విజృంభణ గురించి మాట్లాడారు. మహమ్మారితో పోరాడుతూ కొత్త దశలోకి అడుగుపెట్టామని, ఐక్యంగానే ఇందులో నుంచి బయట పడగలమని నొక్కిచెప్పారు. కోవిడ్ వల్ల ఆర్థికంగానే కాకుండా అనేక రంగాల్లోనూ సవాళ్లు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. 2022లో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) 20వ జాతీయ మహాసభ విజయవంతంగా జరిగిందని, ఆధునిక సోషలిస్టు దేశ నిర్మాణానికి గొప్ప కార్యాచరణ ప్రణాళిక రూపొందిందని చెప్పారు. ఆధునికీకరణ పథంలో సాగే కొత్త ప్రయాణంలో ఒడిదుడుకులు తప్పబోవని హెచ్చరించారు. ఎన్ని కష్టాలు వచ్చినా ప్రజా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా ఉందని, వార్షిక జీడీపీ మొత్తం 120 ట్రిలియన్ యువాన్లను దాటుతుందన్నారు. అంతర్జాతీయ ఆహార సంక్షోభం సమయంలోనూ వరుసగా 19వ ఏటా బంపర్ దిగుబడి చైనాలో నమోదైందని చెప్పారు. చైనా ప్రజలకు ఆహార కొరత రానివ్వలేదన్నారు. పేదరికం నిర్మూలన, గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. పన్ను మినహాయింపులు ఇవ్వడం ద్వారా సులభతర వాణిజ్యానికి మార్గం సుగమం చేశామని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలోనూ అనేక విజయాలు నమోదు చేశామని చెబుతూ షెంఝౌ13,14,15 ప్రయోగాన్ని ప్రస్తావించారు. బీజింగ్ ఒలింపిక్స్, పారాలింపిక్ వింటర్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజా సాయుధ దళాల 95వ వార్షికోత్సవం, నవంబరులో సీనియర్ నేత జియాంగ్ జెమిన్ మరణాన్ని గుర్తుచేశారు. అలాగే, చైనా మూడవ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఫుజియన్ ప్రారంభం, తొలి అతిపెద్ద ప్రజారవాణా విమానం సీ919 రంగ ప్రవేశం, బైహేటన్ జలవిద్యుత్ సంస్థ పూర్తిస్థాయిలో నడవడం వంటి అనేక అంశాలను జిన్‌పింగ్ ప్రస్తావించారు. సమిష్టి కృషితోనే విజయాలు సాధించామని, భవిష్యత్‌లోనూ కలిసికట్టుగా సమస్యలను అధిగమిద్దామని ప్రజలకు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

కొత్త సంవత్సరం వేడుకల్లో అపశృతి

ఉగాండాలో తొక్కిసలాట- తొమ్మిది మంది మృతి

కాంపాలా: ఉగాండాలో కొత్త సంవత్సరం వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది మరణించగా అనేకమందికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉగాండా రాజధాని కంపాలాలో జరిగిందని పోలీసులు ఆదివారం తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా నిర్వహించిన మ్యూజిక్ షోకు మైనర్లు పెద్దసంఖ్యలో హాజరు కాగా బయట నిర్వహించిన బాణాసంచా ప్రదర్శనను వీక్షించాలని వచ్చిన వారందరినీ నిర్వాహకులు ప్రోత్సహించారు. ఈ ప్రదర్శన ముగిసిన తర్వాత తొక్కిసలాట జరిగి ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారందరినీ స్థానిక ఆసుపత్రులకు తరలించగా కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసిందని వారన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

ఆసియా-నాటో సృష్టికి అమెరికా కసరత్తు: కిమ్

ప్యాంగ్యాంగ్: మిలటరీ బ్లాక్ నాటో ఆసియా వర్షన్ సృష్టించాలని అమెరికా తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తోందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ అన్నారు. దక్షిణ కొరియా, జపాన్‌తో సహకారాన్ని బలోపేతం చేసే నెపంతో డీపీఆర్‌కే (డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా)పై ఒత్తిడి పెంచేలా సైన్యాన్ని మోహరిస్తూ 2022లో దూకుడు పెంచిందని ఆరోపించారు. నాటో వంటి మిలటరీ బ్లాక్‌ను కొత్తగా ఆసియాలో ఏర్పాటు చేయాలని దక్షిణ-కొరియా, జపాన్ వంటి దేశాలతో సహకార నెపంతో పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తోందని కిమ్ విమర్శించారు. కొరియా దేశాల మధ్య అంతర్గత పోరు, బాహ్య సవాళ్ల దృష్ట్యా ప్యాంగ్యాంగ్ తన స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవ డం ఎంతో ముఖ్యమని ఆయన ఆదివారం జరిగిన కొరియా వర్కర్స్ పార్టీ ప్లీనరీ సమావేశంలో నొక్కిచెప్పారు. శత్రువు ఎంతటివాడైనా తమ దేశంపైకొస్తే మట్టికరిపించేలా రక్షణ వ్యవస్థ ఉండాలని కిమ్ అన్నారు.

మరో క్షిపణి ప్రయోగం

2023లో ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. దగ్గర లక్ష్యాలు ఛేదించే క్షిపణిని ఆదివారం పరీక్షించింది. జపాన్ సముద్రంలో ఈ పరీక్ష జరిగినట్లు దక్షిణ కొరియా సైన్యం వెల్లడించింది. ఈ క్షిపణి 100కిమీల ఎత్తులో 350కిమీలు ప్రయాణించినట్లు తెలిపింది. దీని సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నట్లు అధికారిక ప్రకటన పేర్కొంది.

ఐదేళ్లలో బీసీ జడ్జీలు 15 శాతమే

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తుల నియామకాల్లో ప్రధాన పాత్రను జ్యుడిషియరీ 30ఏళ్లుగా పోషిస్తోంది. నేటికీ నియామకాల్లో సామాజిక వైవిధ్యత లేదు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీలు, మహిళలను పరిగణనలోకి తీసుకొని సామాజిక వైవిధ్యత దృష్ట్యా జడ్జీల నియామకాలకు ప్రతిపాదనలు పంపాలని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ప్రభుత్వం కోరింది. 2018-2022 డిసెంబరు 19 వరకు మొత్తం 537 జడ్జీలు హైకోర్టులో నియమితులయ్యారు. వారిలో 1.3శాతం ఎస్టీలు, 2.8శాతం ఎస్సీలు, 11శాతం ఓబీసీలు, 2.6శాతం మైనారిటీలు ఉన్నారు. 20 నియామకాలలో సామాజిక నేపథ్యం గురించి సమాచారం లేదు. ఎన్‌జేఏసీ తన సభ్యుల్లో ఇద్దరు ముఖ్యులుంటారని, వారిలో ఒకరు ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ లేక మైనారిటీ/మహిళ ఉంటారని ప్రతిపాదించింది. అది చెల్లదని, రాజ్యాంగ విరుద్ధమంటూ ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం రద్దు చేసింది' అని పేర్కొంది.

నిరుద్యోగం పైపైకి

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్రలో శనివారం విలేకరులకు చెప్పారు. రాష్ట్ర జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) సంకలనం చేసి నవంబరులో విడు దల చేసిన ప్రత్యేక త్రైమాసిక వివరాల ప్రకారం, గత త్రైమాసికంలో 7.6 శాతం పోలిస్తే జులై-సెప్టెంబరు త్రైమాసికంలో నిరుద్యోగిత రేటు 7.2 శాతానికి తగ్గింది. డిసెంబరులో నిరుద్యోగిత రేటు ఉత్తర రాష్ట్రమైన హరియాణాలో 37.4 శాతానికి పెరిగింది. రాజస్థాన్‌లో 28.5 శాతం, ఢిల్లీలో 20.8 శాతంగా ఉందని సీఎంఐఈ గణాంకాలు పేర్కొన్నాయి. ఇదిలాఉండగా, ఉద్యోగాలు, ఉపాధి ఇటీవలి సంవత్స రాలలో దేశం కోసం నిరంతర ఆందోళనగా ఉన్నాయి. కోవిడ్-19 మహమ్మారి ఫలితంగా తీవ్రమైన ఉద్యోగ నష్టాలు సంభవించాయి. ఉపాధిపై మహమ్మారి ప్రభావం ముఖ్యంగా మహిళలపై తీవ్రంగా ఉంది. ఇది 2022లో కూడా కొనసాగింది. కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టడానికి తీసుకువచ్చిన లాక్‌డౌన్ల ప్రారంభ దెబ్బ నుంచి ఉపాధి కోలుకున్నప్పటికీ, పూర్తిగా కోలుకోలేదు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ గృహ సర్వేల వివరాలను పరిశీలిస్తే... జనవరి 2020తో పోల్చితే, అక్టోబరు 2022లో దాదాపు 14 మిలియన్ల మంది తక్కువ మంది వ్యక్తులు ఉపాధి పొందారు. వీరిలో 4.5 మిలియన్ల పురుషులు, 9.6 మిలియన్ల మంది మహిళలు ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భోపాల్‌లో గత అక్టోబరులో మీడియా ప్రచార్భా టం కోసం 'రోజ్‌గర్ మేళా' (ఉద్యోగాల కోసం మేళా) ప్రారంభించారు. అయితే వాస్తవం ఏమిటంటే, 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగం చారిత్రాత్మకంగా అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ రోజ్‌గార్ మేళాలో లక్షల మంది ప్రజలు సంవత్సరాలుగా నిరుద్యోగులుగా ఉన్నప్పటికీ కేవలం 75 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. మోదీ ప్రభుత్వం నాలుగు వివాదాస్పద లేబర్ కోడ్‌ల అమలును మరింతగా అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇవన్నీ కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలమైనవి. ఇవి అంతిమంగా వేగంగా ఉద్యోగ నష్టాలకు దారి తీస్తుంది. మోదీ ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు నటిస్తూనే ఉంది. ప్రతిపక్షంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలతో పాటు నిరుద్యోగులు కూడా ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇప్పుడు దేశంలోని శ్రామిక శక్తికి మరిన్ని కష్టాలు ఎదురు కానున్నాయి.

ఎన్నికలకు వేళాయే

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీల గడువు 2024, జనవరి 4వ, 6వ తేదీలతో ముగియనుండగా రాజస్థాన్ అసెంబ్లీ జనవరి 14న, తెలంగాణ అసెంబ్లీల గడవు 16వ తేదీతో ముగుస్తుంది. కీలక ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో ఎన్నికలు జరుగుతాయన్న సంకేతాలు ఉన్నాయి. 2023 వేసవిలో జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగవచ్చు అని డిసెంబరులో అధికార వర్గాలు చెప్పాయిగానీ భద్రతా పరిస్థితులతో వీటి నిర్వహణ ముడిపడి ఉండటంతో కచ్చితంగా ఇదే సమయానికి జరుగుతాయని చెప్పే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. దీంతో లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనాలే వత్సరంగానూ 2023 పరిణమించనుంది. అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగానే 2024లో లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధమవుతుందన్నది విదితమే.

రాజౌరీలో ముష్కరుల కాల్పులు

ముగ్గురు పౌరుల మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ముష్కరులు జరిపిన దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. తుపాకీ తూటాలతో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. దాంగ్రి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఇద్దరు సాయుధులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని అధికా రులు తెలిపారు. గాలింపు చర్యలు ప్రారంభించినట్లు అదనపు డీజీపీ ముఖేష్ సింగ్ తెలిపారు. ఘటనలో ముగ్గురు మృతి చెందారని, తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని ఆసుపత్రికి తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాజౌరి మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించడంతో అక్కడ గందరగోళం నెలకొంది. గత రెండు వారాల్లో జిల్లాలో పౌరులు హత్యకు గురవడం ఇది రెండోసారి.

చెత్త పన్ను వసూళ్లలో

సెక్రటరీల చేతివాటం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: చెత్త పన్ను వసూళ్లలో వార్డు సచివాలయాల కార్యదర్శులు రాజ్యమేలుతున్నారు. పన్ను వసూలు చేసి సొంతానికి వాడుకుంటున్నారు. ఇప్పటి వరకూ సుమారు రూ.6లక్షల వరకు సొమ్ము పక్కదారి పట్టిందనీ, ఇది కేవలం ఉదాహరణ మాత్రమేననీ, లెక్కలోకి రాని సొమ్ము మరెంతోనని సాక్షాత్తూ జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు మీడియా వేదికగా వెల్లడించారు. అంతేకాకుండా ఈ ఏడాది రెవెన్యూ లక్ష్య సాధనలో భాగంగా రూ.383కోట్లు టార్గెట్ (బకాయిలతో కలిపి) ఇప్పటి వరకు సుమారు రూ.228కోట్లు వసూలైందని, గతేడాదితో పోల్చితే 60నుంచి 70శాతం వరకు మెరుగుదల కనిపించిందని కమిషనర్ స్పష్టం చేశారు. మొండి బకాయిలు రూ.100కోట్ల వరకు ఉంటే అందులో రూ.30కోట్ల వరకూ వసూలు చేశామని చెప్పుకొచ్చారు. అదే విధంగా యూజీడీ సమస్యల పరిష్కారంతో పాటు పారిశుద్ధ్య నిర్వాహణకు 98జోన్ల పరిధిలో మూడు స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని, అధికారులు, సిబ్బంది కూడా ఈ బృందంలో ఉంటారన్నారు. రోడ్డు తవ్వకాలు, పూడ్చివేత విషయంలో గతం కంటే ఇప్పుడు మెరుగైన పరిస్థితులే ఉన్నాయన్నారు. చెత్త పన్ను వసూళ్లలో ఒత్తిళ్లేమీ లేవని, జనంతో తాము నిత్యం మాట్లాడుతున్నామని తెలిపారు. వచ్చే ఏడాది మంచినీటి కొరత ఉండదని, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని, కొత్తగా ఇళ్లకు పన్ను వేసే విషయంలో ఇకపై నిర్లక్ష్యం ఉండదని, రెవెన్యూ విషయంలో కూడా వృథా లేకుండా చూస్తామని, కొత్తేడాది మరింత పారదర్శకంగా జీవీఎంసీ ముందుకు పోతుందని కమిషనర్ స్పష్టం చేశారు.

సమాఖ్య నిర్మాణాన్ని బలోపేతం చేద్దాం

టీఎంసీ వ్యవస్థాపక దినోత్సవంలో సీఎం మమత ప్రతిజ్ఞ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చైర్ పర్సన్ మమతా బెనర్జీ ఆదివారం టీఎంసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమాఖ్య నిర్మాణాన్ని బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. బెనర్జీ తన సొంత రాజకీయ పార్టీని స్థాపించడానికి కాంగ్రెస్ నుంచి వైదొలిగిన తర్వాత జనవరి 1, 1998న టీఎంసీ ఏర్పడింది. 'మా ప్రయాణం జనవరి 1, 1998న ప్రారం భమైంది. ఈ సంవత్సరాలన్నింటిలో మేము ఎల్లప్పుడూ దేశాన్ని మొదటి స్థానంలో ఉంచడానికి కట్టుబడి ఉన్నాము. ప్రజలు మొదటి స్థానంలో ఉన్నారు. మా తృణమూల్ కుటుంబంలోని ప్రతి ఒక్కరు చేసిన అనేక త్యాగాలు, అలుపెరగని ప్రయత్నాలను ఈ రోజు మనం గుర్తుంచుకుంటాము' అని బెనర్జీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. 'మొదటి నుంచి మాకు మద్దతు ఇచ్చిన వారందరూ, వివిధ రాష్ట్రాల నుంచి చేరిన మా కొత్త సభ్యులు, మేము మా గొప్ప దేశం సమాఖ్య నిర్మాణాన్ని బలోపేతం చేస్తూనే ఉంటాము. మేము ప్రజలకు సేవ చేయడానికి మమ్మల్ని అంకితం చేస్తున్నాము. వారి సంక్షేమాన్ని నిర్ధారించడానికి మళ్లీ కట్టుబడి ఉంటాము' అని తెలిపారు. ఆదివారం తృణమూల్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు కునాల్ ఘోష్ మాట్లాడుతూ, 2024లో కేంద్రంలో ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వానికి 'కేంద్రం'గా ఆవిర్భవించాలని పార్టీ ప్రతిజ్ఞ చేసిందని తెలిపారు. 'టీఎంసీ నేడు 25వ సంవత్సరంలోకి అడుగు పెట్టడం నిజంగా గర్వించదగ్గ విషయం. మేము ఇప్పుడు 2024లో కేంద్రంలో ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మేము ప్రజలకు ప్రత్యామ్నాయాన్ని అందించాలనుకుంటున్నాము' అని రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కునాల్ ఘోష్ చెప్పారు. దేశంలో బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రత్యామ్నాయ దృష్టితో ప్రతిపక్షాలు దానికి వ్యతిరేకంగా సమర్థవంతంగా నిలబడితే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీ గెలవడం కష్టమని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన ఒక రోజు తర్వాత ఈ వ్యాఖ్యలు వచ్చాయి. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తన ఫేస్‌బుక్ పేజీలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిపోయిన తర్వాత సభా ప్రాంగణంలో కానుకలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 30వేల మందికి కానుకల పంపిణీకి 24 కౌంటర్లు ఏర్పాటు చేశారు. సభకు హాజరైన మహిళలందరికి ఫౌండేషన్ వారు ముందుగానే టోకెన్లు పంపిణీ చేశారు. టోకెన్లతో హాజరైన వారిని మాత్రమే సభా ప్రాంగణంలోని గ్యాలరీలలోకి అనుమతించారు. చంద్రబాబు ప్రసంగం అనంతరం ఆయన కాన్వాయ్ సభా ప్రాంగణం నుండి వెళ్లిపోయిన తర్వాత ఫౌండేషన్ నిర్వాహకులు, వలంటీర్లు కానుకల పంపిణీకి సిద్ధమయ్యారు. దీని కోసం సభా ప్రాంగణం వద్ద సుమారు 24 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే కానుకల కోసం మహిళలు క్రమపద్ధతిని అనుసరించక పోవడంతో అక్కడ కొంత తోపులాట చోటుచేసుకుంది. వెనుక ఉన్న మహిళలు ఒక్కసారిగా ముందు తోసుకురావడంతో నిర్వాహకులు అదుపు చేయలేకపోయారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా అనేక మంది స్పృహ కోల్పోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు. పరిస్థితిని గుర్తించిన వలంటీర్లు, పోలీసులు స్పందించి గాయపడిన వారిని గుంటూరు నగరంలోని అనేక వైద్యశాలలకు తరలించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలో గోపిదేశి రమాదేవి, షేక్ మస్తాన్ బీ, సయ్యద్ ఆసీయా మరణించగా, ఐదుగురు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో, మరో ఆరుగురు నగరంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిప్ హాఫీజ్ సందర్శించారు. పరిస్థితిని సమీక్షించి, సహాయకచర్యలను పర్యవేక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలను అందించాలని జిల్లా కలెక్టర్ వైద్యులను ఆదేశించారు. ఘటనపై వివిధ పార్టీల నేతలు విచారం వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు: ఉయ్యూరు ఫౌండేషన్

నిబంధనల ప్రకారం అన్నిరకాల అనుమతులు తీసుకొని ఎవరికీ అసౌకర్యం కలగని రీతిలో కానుకల పంపిణీకి ఏర్పాట్లు చేశామనీ ఉయ్యూరు ఫౌండేషన్ అధినేత శ్రీనివాసరావు తెలిపారు. అయితే ముందుగా టోకెన్‌లు జారీ చేసిన వారికంటే అదనంగా ప్రజానీకం ఒక్కసారిగా లోపలకు రావటంతో ఈ అపశృతి చోటుచేసుకున్నదని చెప్పారు. ఈ దుర్ఘటనకు పూర్తి నైతిక బాధ్యత ఉయ్యూరు ఫౌండేషన్ వహిస్తుందన్నారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారికి ఫౌండేషన్ తరపున సంతాపం తెలియజేస్తూ, ఒక్కొక్కరికి రూ.20 లక్షల వంతున ఆర్థిక సహాయం అందచేస్తామనీ, గాయపడిన వారికి కూడా ఫౌండేషన్ అన్నీ విధాల అండగా వుంటుంది.

ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈ ఘటనపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పేదలకు కానుకలు ఇచ్చేందుకు ఉయ్యూరు ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో తాను పాల్గొన్నానని చంద్రబాబు నాయుడు చెప్పారు. కార్యక్రమం ముగిసి తాను వెళ్లిన అనంతరం జరిగిన ఘటనలో ముగ్గురు చనిపోవడం బాధాకరం అని చంద్రబాబు అన్నారు. పేదలకు ఆ స్వచ్ఛంద సంస్థ చేసే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలి అనే ఆలోచనతో తాను కార్యక్రమానికి వెళ్లాను అని చంద్రబాబు తెలిపారు. పేదల ఇళ్లలో జరిగిన ఈ ఘటన తనను ఎంతో కలిచివేసిందని...ఘటన దురదృష్టకరమని అన్నారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు.

ఘటన విచారకరం: జంగాల

గుంటూరు నగరంలో చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీలో తొక్కిసలాట చోటుచేసుకొని ముగ్గురు మృత్యువాత పడటం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఇటువంటి అనుభవాలు ఉన్నప్పటికి గుంటూరులో జరిగిన చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమంలో పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలో తీసుకోవడంలో విఫలమైందన్నారు.

మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన సీపీఎం

గుంటూరు టీడీపీ సంక్రాంతి కానుక వస్త్రాల పంపిణీ తొక్కిసలాటలో ముగ్గురు చనిపోవడం పట్ల మృతుల కుటుంబాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో నిఘా యంత్రాంగం వైఫల్యం కనిపిస్తోందన్నారు.

సీఎం దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుంటూరులో టీడీపీ సంక్రాంతి కానుక వస్త్రాల పంపిణీ తొక్కిసలాట ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను చాలా కలసి వేసిందన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.

ఏపీ అభివృద్ధి ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

మించిపోయి, జీవితాంతం నిరుద్యోగులుగా మారిపోయే పరిస్థితి ఉంది. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తన పాదయాత్రలో ప్రతి ఏట 10 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ హామీ ఇవ్వగా, అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనూ ఇంతవరకు అమలు చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018-డీఎస్సీకి జనరల్ అభ్యర్థుల వయోపరిమితి 44 ఏళ్ల వరకు ఇచ్చి, దరఖాస్తులు స్వీకరించారు. ఆ సమయంలో తక్కువ పోస్టులు ఉన్నందున చాలా మంది ఉపాధ్యాయ పోస్టులు సాధించలేక పోయారు. అదే సమయంలో ఎన్నికలు రావడంతో, జగన్ ఇచ్చిన ప్రతి ఏట మెగా డీఎస్సీ హామీని నమ్మి, ఉపాధ్యాయ నిరుద్యోగులంతా ఆయనకు మద్దతిచ్చారు. అప్పటికి 42 ఏళ్ల నుంచి 44 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారంతా చివరి డీఎస్సీ కోసం ఎదురు చూడగా, జగన్ మొదటి ఏడాది పాలనలో, రెండో ఏడాది, మూడో ఏడాది... ఇలా మూడున్నరేళ్లలో ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు. దీంతో వారందరికీ వయోపరిమితి మించిపోయింది. ఇలా దాదాపు లక్షన్నర మంది అభ్యర్థుల జీవితాలతో జగన్ ప్రభుత్వం చెలగాటమాడుతోంది. ఈ నూతన సంవత్సరంలోనైనా జంబో డీఎస్సీ వస్తుందన్న ఆశతో నిరుద్యోగ ఉపాధ్యాయులున్నారు.

విభజన హామీలపై మౌనం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాల సాధనలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. మూడున్నరేళ్లయినా ఇంతవరకూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేక పోయింది. నాడు ఎన్నికల్లో తనకు 25 మంది ఎంపీలను గెలిపిస్తే... కేంద్ర మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసిన జగన్, తీరా అధికారంలోకి వచ్చాక మోదీకి జపం చేస్తున్నారు. జాతీయ ప్రాజెక్టు అయినా పోలవరంపైనా ఇదే వైఖరితో ఉన్నారు. పోలవరానికి నిధులు రప్పించి, సకాలంలో పూర్తి చేయించలేక పోయారు. కేంద్ర విద్యా సంస్థలను పూర్తి స్థాయిలో నెలకొల్పలేక పోయారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ ఆర్టీసీ, విద్యుత్ పంపిణీ తదితర పెండింగ్ అంశాలు పరిష్కారమవ్వలేదు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో జగన్ సన్నిహితంగా మెలుగుతున్నప్పటికీ ఫలితం లేకపోయింది. నిత్యం అప్పులు తెస్తూ... రాష్ట్రాన్ని మరింత ఆర్థికలేమితో కుంగదీస్తున్నారన్న విమర్శలున్నాయి. గత వైఫల్యాలను గుర్తెరిగి, ఈ నూతన సంవత్సరంలోనైనా రాష్ట్రాభివృద్ధి పైన, విభజన హామీల పరిష్కారం పైన సీఎం జగన్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

బ్యాంకులో రూ.2లక్షల విలువైన నాణేల చోరీ

ముంబై: మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో బ్యాంకులోకి చొరబడి రూ.2 లక్షల నాణేలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఆదివారం తెలిపారు. బోయిసర్‌లోని జాతీయ బ్యాంకుకు చెందిన బ్రాంచ్‌లో గురువారం రాత్రి కిటికీకి ఉన్న ఇనుప గ్రిల్‌ను తొలగించారు. ఆ తర్వాత స్ట్రాంగ్‌రూమ్‌లోకి వెళ్లేందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి నిందితులు చోరీకి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. రూ.2లక్షల విలువైన నాణేల బస్తాలను దొంగిలించారని, వారిని సల్వాడ్-శివాజీనగర్ ప్రాంతంలో అరెస్టు చేసినట్లు చెప్పారు. దోచుకున్న మొత్తంలో రూ.1.80లక్షలు రికవరీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నోట్ల రద్దుపై నేడు సుప్రీం తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

బిఆర్ గవాయ్, బి.వి.నాగరత్న ప్రకటిస్తారు. ఈ రెండు తీర్పులు ఏకీభవిస్తాయా లేక భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయా అనేది స్పష్టంగా తెలియలేదు. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ నజీర్‌తో పాటు జస్టిస్ గవాయ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఏఎస్ బోపన్న, వి.రామసుబ్రమణియన్ సభ్యులుగా ఉన్నారు. 2016 నాటి ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన సంబం ధిత రికార్డులను ఉంచాలని డిసెంబరు 7న అత్యున్నత న్యాయస్థానం కేంద్రం ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ని ఆదేశించింది. దాని తీర్పును రిజర్వు చేసింది. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి... సీనియర్ న్యాయ వాదులు పి.చిదంబరం, శ్యామ్ దివాన్‌తో సహా ఆర్‌బీఐ తరపు న్యాయవాది, పిటిషనర్ల తరపు న్యాయవాదుల వాదనలు విన్నారు. రూ.500, రూ.1,000 కరెన్సీ నోట్లను రద్దు చేయడం చాలా లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్న చిదంబరం, చట్టబద్ధమైన టెండర్‌కు సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనను ప్రభుత్వం స్వయంగా ప్రారంభిం చలేదని, ఇది ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సిఫారసుపై మాత్రమే చేయగలదని వాదించారు. 2016 నోట్ల రద్దు ప్రక్రియను పునః సమీక్షించాలన్న అత్యున్నత న్యాయస్థానం ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తూ, 'గడియారాన్ని వెనక్కి తిప్పడం', 'గిలకొట్టిన గుడ్డును విడదీయడం' ద్వారా ఎటువంటి స్పష్టమైన ఉపశమనాన్ని మంజూరు చేయలేని విషయాన్ని కోర్టు నిర్ణయించలేదని ప్రభుత్వం పేర్కొంది. ఆర్‌బీఐ తన సమర్పణలలో 'తాత్కాలిక కష్టాలు' ఉన్నాయని, అవి కూడా దేశ నిర్మాణ ప్రక్రియలో అంతర్భాగమని అంగీకరించింది. అయితే తలెత్తిన సమస్యలను పరిష్కరించే యంత్రాంగం ఉందని తెలిపింది. నోట్ల రద్దు కసరత్తు 'బాగా ఆలోచించిన' ఒక నిర్ణయమని, నకిలీ నోట్లు, ఉగ్రవాద నిధి, నల్లధనం, పన్ను ఎగవేతలను ఎదుర్కోవడానికి పెద్ద వ్యూహంలో భాగమని అఫిడవిట్‌లో కేంద్రం ఇటీవల సుప్రీంకోర్టుకు తెలిపింది. నవంబర్ 8, 2016న కేంద్రం ప్రకటించిన నోట్ల రద్దు ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలయిన 58 పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది.

ఎన్నికల సంస్కరణలు..మత మార్పిడిలపై విచారణ

సోమవారం సుప్రీం కోర్టు ముందుకు రెండు కీలక కేసులు విచారణకు రానున్నాయి. వాటిలో ఒకటి ఎన్నికల సంస్కరణలకు సంబంధించినది కాగా, మరొకటి బలవంతపు మత మార్పిళ్ల అంశం. ఎన్నికల సంస్కరణలపై 2018లో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను ఉల్లంఘించారంటూ శాసనసభ కార్యదర్శిపై లోక్ ప్రహరీ అనే ఎన్‌జీఓ ఆరోపణలు చేసింది. కోర్టు ధిక్కరణ కింద ఆయనపై చర్య తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఈ ఏడాది నవంబర్ 11న ఆ కార్యదర్శికి నోటీసులు జారీచేసిన సుప్రీంకోర్టు... తదుపరి విచారణను జనవరి రెండో తేదీకి వాయిదా వేసింది. ఎన్‌జీఓ తరపున పిటిషన్ దాఖలు చేసిన ఎస్ఎన్ శుక్లా అనేక అంశాలు ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌తో పోలిస్తే, మరుసటి ఎన్నికల సమయానికి ఆస్తులు రెట్టింపైన ఎంపీలు, ఎంఎల్ఎలు, ఎమ్మెల్సీలపై విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ ఒక విధానపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయలేదని జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో ఆస్తుల గురించి పూర్తి వివరాలు ఇవ్వని లేదా తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని 123(2) అధికరణ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ అంశాన్ని కేంద్రం విస్మరించినట్లు పేర్కొన్నారు. చట్టసభలకు ఎన్నికయ్యేందుకు అనర్హుడిగా ప్రకటించే అంశాలు లేదా కేసులు ఏవైనా ఉన్నాయా అనే విషయాన్ని పేర్కొంటూ దాఖలు చేసే ఫామ్ 26లోనూ కోర్టు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోలేదని శుక్లా తన పిటిషన్‌లో తెలిపారు. ఎన్నికలు, అభ్యర్థుల విషయాల్లో పారదర్శకత అవసరమన్న విషయాన్ని స్పష్టం చేస్తూ... సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను విస్మరించినందుకుగాను, ఆ కార్యదర్శిపై విచారణ జరపాలని శుక్లా కోరారు. కాగా, బెదిరించి... మభ్యపెట్టి మత మార్పిడికి పాల్పడుతున్న ఘటనలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవి కుమార్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం సోమవారం విచారించనుంది. బలవంత మతమార్పిడులు దేశానికి ప్రమాదకరమని సుప్రీంకోర్టు ఇప్పటికే వ్యాఖ్యానించింది. కొంతమంది బెదిరించి, భయపెట్టి లేదా ఆశలు చూపి మత మార్పిడులకు పాల్పడుతున్నారని, ఈ అకృత్యాన్ని ఆపాలని కోరుతూ అశుతోశ్ కుమార్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇది వరకే విచారణకు స్వీకరించింది. ప్రజలకు మత స్వేచ్ఛ ఉందని, అయితే, బలవంతపు మార్పిడులు క్షేమదాయకం కాదని వ్యాఖ్యానించింది. ఇలాంటి ఘటనలు ఎన్ని జరిగాయో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ధర్మాసనం ఆదేశించింది. దీనిపై విచారణ కొనసాగనున్నది.

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేద్దాం

- పేదల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు
- ప్రవాసాంధ్రులు జన్మభూమి రుణం తీర్చుకోవాలి
- జనతా వస్త్రాలు-చంద్రన్న సంక్రాంతి కానుక పంపిణీలో చంద్రబాబు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీని బంగాళాఖాతంలో కలిపితేనే పేదలకు న్యాయం జరుగుతుందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పేదరికం లేని సమాజం చూడాలన్నది టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎన్‌టీఆర్ ఆశమని, అదే సిద్ధాంతం కోసం తానూ పని చేస్తున్నానని ఆయన తెలిపారు. ఆదివారం గుంటూరులోని వికాస్ కళాశాల మైదానంలో 'ఎన్టీఆర్ జనతా వస్త్రాలు - చంద్రన్న సంక్రాంతి కానుక' కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తదుపరి పేదల మహిళలకు, చీర, నిత్యావసరాల కిట్‌ను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ 2023లో ప్రజల కష్టాలు తొలగిపోయి, పేదలకు మంచి భరోసా కల్పించే ఏడాది కావాలన్నారు.

2014లో టీడీపీ అధికారంలో వచ్చిన తరువాత పేదలంతా పండగలు చేసుకోవాలని సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫాలు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అవన్నీ నిలిపివేసిందన్నారు. టీడీపీ ఎప్పుడూ పేదల పక్షమేనని 2014లో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000 చేసి ఇంట్లో ఎంతమంది లబ్దిదారులు ఉంటే అంతమందికీ ఇచ్చామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రకరకాల కొర్రీలు పెడుతోందనీ, ఇంటికి ఒకటే పింఛను అంటోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే మొదటి రోజే పెన్షన్ రూ.3000 అయ్యేదన్నారు. నాడు అన్న క్యాంటీన్ ద్వారా రోజుకు రూ.15 రూపాయల ఖర్చుతో మూడు పూటలా కడుపునింపుకునే సౌకర్యం ఉండేదనీ, నేడు అన్నా క్యాంటీన్ ఎందుకు మూసేశాడో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం, నిలిచిపోయిన పథకాలు తిరిగి ఇవ్వడం ఖాయమని స్పష్టం చేశారు. జగన్‌కు పాలన చేతకాదనీ, రాష్ట్రంలో పాలన తిరుగమనంలో వెళుతోందన్నారు. జగన్‌ను నమ్ముకుంటే పేదలకు గాని, రాష్ట్రానికి గాని ఎటువంటి లాభమూ ఉండదన్నారు. ఎప్పుడైనా పాలకులంటే అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లాలనీ, సంపద సృష్టిస్తే ఆ సంపద ప్రజలకు పంచడానికి ఉంటుందన్నారు. బాదుడే బాదుడుతో పేద ప్రజలు విలవిల్లాడుతున్నారు. కరెంట్ చార్జీలు సహా అన్నీ పెంచేసి ఈ జగన్ మాయమాటలు చెబుతున్నాడన్నారు. పేదల సంపద దోచుకున్న జగన్‌కు పేదల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

టీడీపీ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లు ఇచ్చి ఉంటే పేదలకు ఒక ఆస్తిగా ఉండేదనీ, 90 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లలో మిగిలిన పనులను కూడా పూర్తి చేయలేని ప్రభుత్వం ఇది అన్నారు. ప్రవాసాంధ్రులు జన్మభూమి రుణం తీర్చుకోవడానికి ముందుకు వచ్చి పేదలకు మరింత సాయం చేయాలని పిలుపునిచ్చారు. ఉయ్యూరు ఫౌండేషన్ అధినేత శ్రీనివాసరావు మాట్లాడుతూ మొత్తం రూ.6 కోట్లు విలువ చేసే 30 వేల జనతా వస్త్రాలు, నిత్యావసరాల కిట్‌లను ఇస్తున్నామన్నారు. టీడీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు, గుంటూరు పశ్చిమ, తూర్పు ఇన్‌చార్జిలు కోవెలమూడి రవీంద్ర, నసీర్ అహ్మద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ అమరావతి-2023 క్యాలెండరు ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి-2023 క్యాలెండరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ డైరీ-2023ని సీఎస్ విడుదల చేశారు. ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు వీ గిరి కుమార్‌రెడ్డి, ఎన్ శ్రీనివాస్, ఆర్‌వీ రాజేశ్, ఎం మాధురి, జీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.అంజనేయకుమార్ (చంటి), కార్యదర్శి సాంబశివరావు, వీఆర్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు జి.జయరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

రేపు సీఎం జగన్ రాజమహేంద్రవరం పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 3వ తేదీన రాజమహేంద్రవరం జిల్లాలో పర్యటిస్తారు. ఉదయం 10గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారు. 11.20 నుంచి 1.10 వరకు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం బహిరంగ సభలో సీఎం ప్రసంగం, కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.40 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

సీఎం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా తాడేపల్లి సీఎం నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కేక్ కట్ చేయించారు. సీఎం జగన్‌కు శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు, ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ, గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్, వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో ప్రజల పక్షాన ఉద్యమం

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: నగరంలోని సీపీఐ జిల్లా పార్టీ ప్రధాన కార్యాలయంలో 2023 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నగర సమితి అధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వందలాది మంది పార్టీ శ్రేణుల మధ్య ముందుగా భారీ కేక్‌ను కట్ చేశారు. జగదీష్, జాఫర్‌లకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆ పార్టీ అనుబంధం టీచర్స్ యూనియన్ సౌజన్యంతో కార్యాలయం సమీపంలో ఉన్న సుమారు 20 నిరుపేద కుటుంబాలకు కొత్త దుస్తులు ఉచితంగా పంపిణీ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ గడచిన సంవత్సరం అనేక పోరాటాలు చేశామని జగదీశ్, జాఫర్ గుర్తు చేశారు. 2023 కొత్త సంవత్సరంలో పార్టీ శ్రేణులందరూ నూతన ఉత్సాహంతో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు తదితర అన్ని వర్గాల ప్రజల పక్షాన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, రామకృష్ణ, పద్మావతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుల్లాయ్ స్వామి, చిరంజీవి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ కుమార్, సంతోష్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ గౌడ్, రూరల్ మండల కార్యదర్శి రమేశ్, నగర సహాయ కార్యదర్శి అల్లీపీర సహా అనుబంధ సంఘాలు, ఎస్టీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కలిసి కష్టపడదాం: ఎండీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కలిసి కష్టపడదామని ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. విజయవాడ ఆర్టీసీ బస్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. 2022 సంవత్సరాన్ని మనమంతా గుర్తుంచుకోవాల్సిన అంశమనీ, టికెట్ల రెవెన్యూ, కార్గో ఆదాయంలో లక్ష్యాన్ని సాధించామని చెప్పారు. ప్రయాణికులకు ట్రాఫిక్ సిబ్బంది ఉత్తమ సేవలు అందించారని, కార్గో డోర్ డెలివరీ విధానం ద్వారా వినియోగదారుల మన్ననలు పొందారన్నారు. మరణించిన ఉద్యోగుల పిల్లకు ఇతర శాఖల్లో ఉద్యోగ నియామకాలను ప్రభుత్వ సహకారంతో కొందరికి పూర్తి చేశామని వివరించారు. మిగిలిన వారికి సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించే యోచనలో ఉన్నామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని, అన్ని డిస్పెన్సరీలలో గుండెపోటును ముందుగానే గుర్తించే వీలున్న ఆధునిక సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 2022లో మంచి ఫలితాలు సాధించామని పొంగిపోకుండా, ఈ నూతన సంవత్సరంలో అంతకంటే మెరుగైన ఫలితాల సాధన కోసం నడుం బిగించాలని కోరారు. ఇదే ఉత్సాహంతో సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కోటేశ్వరరావు అధ్యక్ష వహించగా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, రవి వర్మ, శోభా మంజరి, అధికారులు బషీర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు, వివిధ అసోసియేషన్ల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు పొత్తూరి పేరయ్య కన్నుమూత

విశాలాంధ్ర-పెదకొత్తపల్లి: ప్రకాశం జిల్లా కమ్యూనిస్టు నేత అమరజీవి నల్లూరి అంజయ్య సహచరుడు, నిబద్ధ కమ్యూనిస్టు పొత్తూరి పేరయ్య (97) శనివారం రాత్రి 12గంటలకు తుదిశ్వాస విడిచారు. గత నెలరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. పెదకొత్తపల్లి పంచాయతీ, మారెళ్లగుంట పాలెంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన పేరయ్య నల్లూరి అంజయ్య నేతృత్వంలో యువజన సంఘ సభ్యుడిగా గ్రామంలో అనేక సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. 1948-51 మధ్య కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధకాండ అమలు జరిగిన కాలంలో అజ్ఞాత వాసంలోకి వెళ్లాడు. అజ్ఞాతవాసం నుంచి బయటకు వచ్చిన తరువాత హరిజనులను చెరువులో నీళ్లు తెచ్చుకోనీయక అగ్రవర్ణ రైతులు ఆటంక పరచటాన్ని ఎదిరించారు. వారితో నీళ్లు తెప్పించినందుకు అగ్రవర్ణాల సాంఘిక బహిష్కరణకు గురైన వారిలో పేరయ్య ఒకరు. సేవా కార్యక్రమాలలో ఆయన అగ్రభాగాన ఉండేవారు. అంజయ్య నగర్‌లో ఎద్దు సుబ్బారావు కల్యాణ వేదిక నిర్మించడానికి మారెళ్లగుంటపాలెంలో వృద్ధాశ్రమంలో ఒక గది నిర్మాణానికి విరాళమిచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సరోజ్ సేవా ఫౌండేషన్, ఆసరా ఆధ్వ ర్యంలో నిర్మించిన పొత్తూరి సుబ్బమ్మ పేరయ్య" కమ్యూ నిటీ హాల్‌కు తనకున్న 2.75సెంట్ల భూమినివ్వడమే గాక, ఆయన కుటుంబ సభ్యులు భూరి విరాళమిచ్చారు.

గ్రామ కమ్యూనిస్టు పార్టీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉండటమేకాక, గ్రామ ప్రజల అభిమానాన్ని చూరగొన్న, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు పేరయ్యకు కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, కమ్యూనిజం సంపాదకులు ఎంసీ వెంకటే శ్వర్లు, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాయకులు ప్రేం పావని, జిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి వి.హనుమారెడ్డి, పి.శీతారామయ్య తదితరులు నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి నాయకులు పావులూరి అంజయ్య, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి నల్లూరి రామారావు, గోవిందయ్య, గోగినేనిరావు, మద్దిపాడుమండల టీడీపీ నాయకులు మండవ రంగారావు, సరోజ్ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, భూపతిరావు, శివకాశేశ్వం రావు తదితరులు పేరయ్య మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

బహుముఖ ప్రజ్ఞాశీలి ముక్కామల

విశాలాంధ్ర-విజయవాడ: స్వాతంత్ర్య సమర యోధునిగా, సంఘ సేవకునిగా, సాహిత్య ప్రియునిగా, రైతు ఉద్యమ నేతగా, కమ్యూనిస్టు ఉద్యమంతో పెనవేసుకున్న ముక్కామల నాగ భూషణం అన్ని వర్గాల ప్రజలతో బహుముఖ ప్రజ్ఞాశీలిగా కీర్తింపబడ్డారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ కొనియాడారు. అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక మండలం ఈలచెట్లదిబ్బ గ్రామంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ అధ్యక్షతన ముక్కామల నాగభూషణం విగ్రహం వద్ద జరిగిన సభలో కేవీవీ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముక్కామల సేవలకు గుర్తుగా ప్రతి ఏటా డిసెంబర్ 31 రాత్రి ఆనవాయితీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివిసీమ లంక గ్రామాలు ఈలచెట్లదిబ్బ, ఎదురుమొండిలో కెనడీఎస్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ వారి సహకారంతో ఆ గ్రామాలలో తాగు, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టి ఆ గ్రామాల ప్రజల మనస్సుల్లో గూడుకట్టుకున్నారని అన్నారు. ఆయా గ్రామాలకు విద్యుత్ వసతి కల్పించారని, 600 ఎకరాల బంజరు భూమిని పేదలకు పంపిణీ చేయించి పట్టాలు మంజూరు చేయించటంలో అద్వితీయమైన పాత్ర నిర్వహించారని చెప్పారు. విజయవాడలో గాంధీ స్మారక పర్వతం ఏర్పాటు, అభివృద్ధిలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. గాంధేయవాదిగా జాతీయోద్యమంలో పాల్గొన్నారని, సంఘ సంస్కరణ ఉద్యమాల్లోనూ, రైతాంగ ఉద్యమాలోనూ తన వంతు పాత్ర నిర్వహించారని అన్నారు. హిందీ, ఇంగ్లీషు,

తెలుగు, సంస్కృతం భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉన్నారని చెప్పారు. లంక గ్రామాలలో తుపాను షెల్టర్ల నిర్మాణంలో కీలక పాత్ర వహించారని కేవీవీ ప్రసాద్ అన్నారు. రచయితగా అనేక పుస్తకాలు, కవితలు, నాటకాలు, నాటికలు రచించి, సాహిత్య రంగంలో కూడా తనదైన ముద్ర వేసుకున్నారని వెల్లడించారు. జ్యోతిష్య, ఖగోళ, నిర్మాణ శాస్త్రాల్లో నిపుణులైన ముక్కామల స్ఫూర్తివంతమైన ప్రసంగాలతో యువతను ఎంతగానో ప్రభావితం చేశారని తెలిపారు. 1936 నుంచి 1947 మధ్య కాలంలో రైతాంగ ఉద్యమాల్లో కీలక పాత్ర వహించి జైలు జీవితాన్ని అనుభవించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య అనేక అభ్యుదయ గీతాలు ఆలపించి సభికులను ఉర్రూతలూగించారు. రైతు సంఘం జిల్లా నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ, చినకళ్లేపల్లి గ్రామ సర్పంచ్ గుత్తికొండ రామారావు మాట్లాడుతూ పల్లెసీమల్లో సమస్యలను స్థానిక ప్రజలు చర్చించి, ఐక్యంగా వాటిని పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలోని అనేక సమస్యలను సీపీఐ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు వేమూరి రత్నగిరిరావు, సీపీఐ, రైతు సంఘం నాయకులు కోదాటి నాగయ్య, దాసరి గోపాలకృష్ణ, నక్కా శ్రీనివాసరావు, ఈలచెట్లదిబ్బ గ్రామ సర్పంచ్ విజయ, గ్రామ పెద్దలు చెన్ను వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొక్కిలిగడ్డ ఆదినారాయణ, నీటిసంఘం అధ్యక్షులు కొక్కిలిగడ్డ జగజ్జీవనరావు, కొక్కిలిగడ్డ పరమేశ్వరరావు, గ్రామ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేత పీవీ చలపతిరావు కన్నుమూత

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: బీజేపీ సీనియర్ నేత పీవీ చలపతిరావు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. రాష్ట్రంలో బీజేపీకి సీనియర్ నేతగా, విశాఖపట్నంలో బీజేపీ నిర్మాణానికి కృషి చేసిన ఆయన, గతంలో అనకాపల్లి ఎంపీగా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చలపతి రావును ఆరిలోవ పినాకిల్ ఆసుపత్రిలో చేర్పించారు. పీవీ చలపతిరావు కుమారుడు పీవీఎన్ మాధవ్ ప్రస్తుతం ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు. చలపతిరావు భౌతికకాయన్ని కుటుంబ సభ్యులు ఇసుకతోట పితాపురం కాలనీకి తరలించారు. 26 జూన్ 1935న జన్మించిన పీవీ చలపతిరావు, 1945లో ఆర్‌ఎస్ఎస్‌లో చేరారు. 1950 నుంచి 1954 వరకు విశాఖపట్నం చుట్టుపక్కల ఉన్న వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఆయన అధ్వర్యంలో ఏబీవీపీ యూనిట్లు ప్రారంభించారు. 1955లో గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొన్నారు. 1959 నుంచి 1966 వరకూ రాష్ట్ర ప్రభుత్వంలో పారిశ్రామిక విస్తరణ అధికారిగా చేరారు. 1972 నుంచి 1973 వరకు ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించారు. 1974, 1980లో ఉత్తర సర్కార్ జిల్లా గ్రాడ్యు యేట్ నియోజకవర్గం నుంచి శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1980 నుంచి 1986 వరకూ బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 1983లో రాష్ట్ర ప్రతిష్టాత్మక ట్రేడ్ యూనియన్ 'శ్రమశక్తి' అవార్డు సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక అవార్డులు సన్మానాలు అందుకున్నారు.

జేవీఎస్ఎన్ మూర్తి సంతాపం: చలపతిరావు మృతిపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. చలపతిరావు నిబద్ధత కలిగిన, ప్రజల సమస్యల పట్ల అవగాహన గల గొప్ప రాజకీయ నాయకుడని కొనియాడారు.

దళితులను మోసగించిన ప్రభుత్వం: నాదెండ్ల



విశాలాంధ్ర-గుంటూరు: స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తరువాత కూడా రాష్ట్రంలో దళితులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, వారిని ఉన్నత స్థాయిలో చూడాలని పవన్ కల్యాణ్ ఎంతో తపన పడుతున్నారని జనసేన రాష్ట్ర నాయకులు, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి, రాష్ట్ర రెల్లి యువత నాయకులు సోమి ఉదయ్ అధ్వర్యంలో ఆదివారం రెల్లి సంఘ నేతలు నాదెండ్ల మనోహర్‌తో ప్రత్యేక సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీల్లో ఉన్న పేదరికాన్ని అవగాహనారాహిత్యాన్ని ఆసరాగా తీసుకుని రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకుంటు న్నాయని మనోహర్ విమర్శించారు. దళితులు ముఖ్యమంత్రి జగన్‌ని తమ రక్త సంబంధీకుల కన్నా ఎక్కువగా నమ్మారని, అలాంటి వారికి గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని ద్రోహం జగన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సమగ్ర సంక్షేమం కోసం ఎప్పటినుంచో ఉన్న సుమారు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి, దళితుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను రెల్లి సామాజికవర్గాన్ని దత్తత తీసుకుంటున్నానని ఎప్పుడైతే పవన్ కల్యాణ్ ప్రకటించారో ఆ క్షణం నుంచి రెల్లి జాతికి గౌరవం, విలువ మరింత పెరిగాయన్నారు. ప్రతీ రెల్లి జాతి యువకుడి గుండెల్లో పవన్ కల్యాణ్ శాశ్వత స్థానాన్ని సంపాదించు కున్నారని త్వరలోనే వారితో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, తిమ్మపాలు నుంచి వచ్చిన రెల్లి నేతలు మనోహర్‌ని ఘనంగా సన్మానించారు. కోన అప్పారావు, గోపి, కోన దుర్గ, ధనాల రాఘవేంద్ర, సోమి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్ని వస్త్రాల విక్రేతల వలస కష్టాలు

విశాలాంధ్ర - నాతవరం (అనకాపల్లి): శీతాకాలం అనేకమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధినిస్తోంది. రోడ్డు పక్కన, ప్రధాన కూడళ్లలో గుడారాలు ఏర్పాటు చేసుకొని ఉన్ని వస్త్రాలు విక్రయించే వలస కార్మికుల పరిస్థితి దయనీయం. పొట్టకూటి కోసం స్వరాష్ట్రం, సొంత కుటుంబాలకు దూరంగా గడుపుతారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు ఎముకలు కొరికే చలిలో రోడ్ల పక్కన గుడారాల్లో నివసిస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. అయితే జిల్లాలోని నర్సీపట్నం, రావికమతం, చోడవరం తదితర ప్రాంతాల్లో ఉన్ని వస్త్రాల వ్యాపారం జోరుగా సాగుతుంది. లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. అయితే లాభాలు వ్యాపారాలు కూలీ డబ్బులు మాత్రమే కార్మికులకు లభిస్తాయి. కార్మికుల్లో కొంత మంది వ్యాపారులు ఇచ్చే జీతాలపై ఆధారపడగా మరికొందరు అమ్మకాలపై కమీషన్ ప్రతిపాదికన వ్యాపారం చేస్తారు. అలా చేయడం వల్ల లాభం ఉంటుందని కొందరు అంటున్నారు. వస్త్రాల పార్శిల్స్‌ను వ్యాపారులు పంపితే వాటిని అమ్మి పెట్టడం తమ వంతు అని, అందుకు కొంత తమకు ముట్టుతుందని కార్మికులు చెబుతున్నారు. జరిగిన అమ్మకాలకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో యజమానులకు ఇచ్చేయాలన్నారు. కొందరు కుటుంబసమేతంగా వలస వచ్చేసి వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలిపారు.

పింఛన్లలో జగన్‌ది నయవంచన: అచ్చెన్నాయుడు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రూ.3వేల పింఛన్ ఇస్తానని నమ్మించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నయవంచన చేశారంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. మొదటి ఏడాది నుంచే రూ.3వేలు ఇచ్చి ఉంటే ఒక్కో పింఛన్ దారుడికి లక్షా80వేల రూపాయల లబ్ది కలిగేదనీ ఆదివారం ఒక ప్రకటనతో తెలిపారు. ఇప్పటివరకు (43 నెలలు) ఇవ్వాల్సింది లక్షా 29వేల రూపాయలు కాగా ఇచ్చింది రూ.84 వేలు మాత్రమేనని చెప్పారు. ఈలెక్కన సగటున ఒక్కో పింఛన్‌దారుడికి రూ.45వేలు ఎగనామం పెట్టారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రూ.200గా ఉన్న పింఛన్‌ను రూ.2000కు పెంచారన్నారు. రూ.3000 పెన్షన్ ఇస్తానన్న జగన్ ఇప్పటివరకు పెంచినది రూ.500 అని చెప్పారు. తాజాగా మరో రూ.250 పెంచుతున్నారని గుర్తుచేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడు 39లక్షలుగా ఉన్న పెన్షన్లను 2019 నాటికి 54లక్షలకు పెంచారని, అదనంగా 16లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేశారని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చే నాటికి 54 లక్షల పెన్షన్లను 64 లక్షలకు పెంచారని, 10లక్షల మందికి మాత్రమే కొత్తగా పెన్షన్లు మంజూరు చేశారన్నారు. 2014 నాటికి ఉన్న పెన్షన్ల సంఖ్యనే ప్రకటనల్లో చూపుతూ ప్రజల్ని మభ్యబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి పెన్షన్లపై నెలకు చేసిన ఖర్చు రూ.400 కోట్లు కాగా ఆయన దానిని రూ.1384కోట్లకు పెంచారని, రూ.1.47 కోట్ల రేషన్ కార్డుదారులకు ప్రతినెలా 9 రకాల సరుకులు ఇచ్చారన్నారు. సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగ కానుకలు అందించారని తెలిపారు.

అమ్మకు కవితా నీరాజనం

ఈ ప్రపంచంలోనే అపురూపమైనది, అపూర్వమైనది అమ్మ. అమ్మకు ప్రత్యామ్నాయం లేనేలేదు. అమ్మకు ప్రతిరూపం లేనేలేదు. సృష్టిలో ఎన్ని అనుబంధాలు కలుషితమై పోతున్నా శతాబ్దాల మాతృత్వం మాత్రం కల్మషం లేనిది. కలుషితం కానిది. అమ్మ ఎన్నెన్నో పూల ఆత్మీయతల్ని భుజస్కంధాలపై మోసే రెమ్మ. ఎన్నెన్నో దుఃఖాలను తనలో ఇముడ్చుకొనే కన్నీటి చెమ్మ. ఆమె నవ్వు కురిపించే కాంతులు చీకటిని చిదిమేస్తూ జగమంతా పరచుకునే వెన్నెల కిరణాలు. ఆమె మాట అందించే ఆహ్లాదం పూల సరాగాలతో అలరించే మధుమాసం. అమె ఆత్మీయత వెదజల్లే చల్లదనం ఎదఎదలో ఝల్లుమంటూ పారే తొలకరి గానం. ఆమె అనురాగం వినిపించే సుస్వరాల ఝరి నడిరేయి సెలయేటి గలగలల సంగీత విభావరి. అనుబంధపు వులితో బ్రతుకుల రాళ్లను మహత్తర శిల్పిలా అందంగా, బహుచందంగా రూపుదిద్దుతుంది. అటువంటి అనంత పార్శ్వాలున్న అమ్మ ప్రేమకు కవిత్వమూ దాసోహమైపోతుంది. అమ్మలో పరకాయప్రవేశం చేసి తానే అమ్మ అయిపోతుంది. మనకు గోరుముద్దలు తినిపిస్తూ వెన్నెలంత అనుభూతుల్ని పంచుతుంది. అమ్మ ఆశీనురాలు కావడానికి తానే సింహాసనం అయిపోతుంది. అమ్మ తలపుల ఆత్మీయతల్ని మన మనసుల్లోకి అలవోకగా వొంపుతుంది. కవిత్వం అమ్మపాటై పాటమరిస్తుంది.

'నువు పాడుతుంటే అమ్మా/ అమ్మలందరూ ఒక సముద్రమై
మన ఇంటిముందుకు/ పొంగిపొరలుకుంటూరావడం
నాకు అగుపించిందమ్మా/ అమ్మా, ఇప్పుడు నీ పాట నా చిటికెన వేలికి
నువ్వు చేయించిన నీలంరాయి ఉంగరంలా/ తగులుతున్నదమ్మా'
('అమ్మచెట్టు' సంకలనం నుంచి)

అంటూ అమ్మను విలక్షణ పదచిత్రాలతో కీర్తిస్తారు పైగంబర కవి దేవిప్రియ. అమ్మ పాటను ఉప్పొంగే కడలిలో దర్శించింది కవిత్వం. అమ్మ గొప్పతనాన్ని వర్ణించడానికి, అమ్మ ఆత్మీయతను బేరీజు వేయడానికి పొంగిపొరలి వచ్చే సముద్రానికి మించిన ప్రతీక ఇంకేముంటుంది!?. ఎందరో అమ్మల కలయిక సముద్రమైతే సముద్రం ఎంత శక్తిమంతమైనది అయివుండాలి!?. ఆ శక్తిని పాలపుంతలుగా కురిపించి తానూ శక్తిమంతమైపోయింది కవిత్వం. అమ్మపాటను సముద్రం చేసినందుకు గర్వంగా తలెత్తుకొని తన ఠీవిని ప్రదర్శించింది. తన చిటికెన వేలిని అమ్మ చేయించిన నీలం రాయి ఉంగరం ఎంత ఇష్టంగా హత్తుకుంటుందో అంతే ఇష్టంగా అమ్మపాట తన హృదయాన్ని హత్తుకున్నదంటూ కవి అమ్మకు నీరాజనాలర్పిస్తాడు. ఆ నీరాజనాలతో కవిత్వం చేతులు కలిపి అమ్మకు సమున్నత గౌరవాన్ని కల్పించింది. సముద్రపు పొంగులలో అమ్మకు ఎన్నో హంగులు కల్పించింది. మాతృత్వాన్ని రంగులమయం చేసింది.

'బానిసత్వపు అలుపెరుగని పేగుల్లోంచి/ గుండెల్ని కుతకుతలాడించే చెమట చిత్తడుల్లోంచి
ఆకలి ఊటలు సముద్రాలైనా యజమాని ఆజ్ఞలను పాటస్తూ/ సూర్యుడితో పోటీపడే అమ్మ
ఎన్నో దీపాల్ని కళ్లలో పెట్టుకొని చూసినా/ తనివితీరని ఓ పండువెన్నెల
జాలిని పాలించే రాజ్యాధినేత్రి.......నాలోంచి నన్ను చేదుకొని తరతరాలు
తలెత్తుకొని సెల్యూట్ చేసే/ అసలుసిసలైన అమ్మజెండానావిష్కరించాలి'
('అమ్మజెండా' ఖండిక నుంచి)

అంటూ శ్రమజీవన సౌందర్యానికి ప్రతీకలా కనిపించే అమ్మను ఆత్మగౌరవ పతాకంగా దర్శించాలని తపిస్తారు కొమ్మవరపు విల్సన్ రావు. ఇక్కడ అమ్మ గుండెలోతుల్లోని ఆర్ద్రతను మరింతగా తడుముతూ ఆవేదనై వర్షించింది కవిత్వం. తరతరాల బానిసత్వాన్ని పెంచిపోషించే ఆజ్ఞలను ప్రశ్నించింది. అనంత సముద్రంలో తీరని ఆమె ఆకలి ఊటల్ని దర్శించింది. వేదనను అనుభవిస్తూనే అమ్మ విధిని నిర్వహిస్తూ చూపించే నిబద్ధతను సూర్యుడితో పోల్చింది. పండు వెన్నెల లాంటి, జాలి రాజ్యానికి అధినేత్రి వంటి అమ్మఅస్తిత్వ పోరాటంలో పాలుపంచుకుంది కవిత్వం. అందుకే ఆమె పట్ల నిర్లక్ష్యం చూపిన తరతరాలే నీరాజనాలర్పించే నిలువెత్తు ఆత్మగౌరవ పతాకంగా ఆమెను ఆవిష్కరించాలని సమాయత్తమవుతోంది. కవిత్వం అమ్మ అయినప్పుడు గొప్ప వాక్యాలుగా ప్రవహిస్తూ వుంటుంది. ఆత్మీయతా జలపాతాలైపోతూ వుంటుంది. మనల్ని లాలిస్తూ ముప్పిరిగొంటుంది. కవిత్వం అమ్మలోని కమ్మదనాన్ని పాలలోని వెన్నెలా వెలికితీస్తుంటుంది. అమ్మతనానికి ఎన్నో భాష్యాలు చెబుతుంటుంది. అమ్మ ఒక పూల రుతువైతే కవిత్వం ఆమనిలా ఆమె వెన్నంటే వుంటూ మాతృత్వపు సొబగుల్ని ప్రపంచానికి చాటిచెబుతూ వుంటుంది.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

సాహితి

శాంతి పుష్పాలు

నెత్తురు పారిన నేల
మొక్కలు మొలవవు...
శాంతి పూచిన నేల
ఉద్యాన వనాలు
వెలుస్తాయి!!!

జ్ఞాపకాలు

జ్ఞాపకాలు
జల్లిస్తే
మిగిలాయి
కొన్ని ముత్యాలు
కొన్ని సత్యాలు!

రచన: కేశవ్ గోపాల్

సదాశయ సంకల్పం

మనసంత మురవంగ
మేను పరవశించగ,
అందాల లోగిళ్ళ ముంగిళ్ళు
సంతసాల సౌరభమవగ,
వాడిపోని మల్లెల చిరునవ్వులతో
అంబరాన సంబరాలు మోసుకొచ్చిన
"నవ్యాంగ్లవత్సరం"లో
అనుభవాల ముల్లె
భద్రంగా దాచుకొని
మమతల మూట విప్పి
చెలిమితోటలో విహరిస్తూ
స్నేహపరిమళాలు ఆస్వాదిస్తూ,
మమకారాల సిరులు పొందుదాం.

ప్రతి ఎద సంతోషసాగరమై
ఆనందం వెల్లువై పారేటట్టుగా
మానవత్వ మాధుర్యాన్ని పంచుతూ,
తోటివారికి చేయూతనందిస్తూ,
ఎవరికెవరమోకాక
అందరికీ అందరమై,
నిష్కల్మష హృదయంతో
మహోన్నత వ్యక్తిత్వంతో
విజయాల పూలు పూయిస్తూ
మార్పుతో మంచి సాధిద్దాం.

సాగిపోదాం సత్సంకల్పంతో,
దూసుకుపోదాం సదాయశంతో,
శిఖరాలు అధిరోహిద్దాం
సమధికోత్సాహంతో...

వేమూరి శ్రీనివాస్, 9912128967

కవి యాత్ర

కవి నిరంతర యాత్రికుడు
ఎక్కడ అవినీతి కళ్లు తెరుస్తుందో
అక్కడికి అక్షరాయుధంతో
కవితా రథాన్ని నడిపిస్తాడు.
అతనిది అంతరాయ మెరుగని
సుదీర్ఘ జీవన యాత్ర
ఎన్నెన్నో కవితా ఖండికలు
పురుడు పోసుకుంటాయి.
కొన్ని రత్న కిరీటాలై మెరుస్తాయి
జాతి రుగ్మతల్ని పసిగట్టి
రుగ్మతా రాహిత్యం కోసం
అడుగుల్లో చైతన్యం నింపుకొని
విక్రమార్కుడై విహరిస్తాడు
రోజు రోజుకీ
దిగజారుతున్న విలువలు
జాతిని అవహేళన చేస్తాయి
స్వార్థం విశ్వరూపమెత్తి
రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తుంది
హద్దులుదాటుతున్న వాతావరణం
కలానికి కలవరం అవుతుంది
హలమై, సమాజాన్ని దున్ని
మానవత్వపు మొక్కల్ని నాటే
ప్రయత్నంలో నిమగ్నమౌతుంది
వాటి వేరులు ఎరుపెక్కి
అవినీతి కలుపును
కాల్చేందుకు సిద్ధపడుతుంది.
ఒకరోజు ఆలస్యమైనా,
నీతిపరిమళంజాతంతా వ్యాపించి
యువతలో జాతీయతత్వం
విధిగా అలవరుస్తుంది
చైతన్యం రగిలించి
నవ సమాజ సృష్టికి
మార్గమౌతుంది

-ఎస్.ఆర్.పృథ్వి
సెల్: 9989223245

వయోపౌరుల మనోభావాల వేదిక 'జీవన సంధ్య'

జీవితంలో ఎదిగే క్రమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని తడబడుతూ నిలబడుతూ క్రమంగా స్థాయిని పెంచుకుంటూ సాగే క్రమంలో పిల్లల్ని ఉన్నతస్థానంలో ఉండేలా తీర్చిదిద్దినా చివరకు ఎవరికివారే యమునాతీరే అన్న రీతిలో ఒంటరిగా వృద్ధాశ్రమంలో శేషజీవితాన్ని గడిపే వృద్ధులెందరో ఉన్నారు. ఇంకొందరు తామెవరో తెలియని స్థితిలో అనాథలుగా జీవనాన్ని సాగించేవారూ కనిపిస్తారు అక్కడక్కడ. ఎలా ఉన్నా వృద్ధాప్యమంటే జీవితంలో ఎదురయ్యే మంచి-చెడుల సంగమం. అనుభవాల జీవనసారం. అటువంటి వారి జీవితాలను వింటున్నా, చదువుతున్నా వృద్ధాప్యంలో ఇన్ని వెతలా! అనిపించకమానదు. వృద్ధాశ్రమాల్లోనో, ఒంటరిగానో ఎక్కడో జీవించేవారు నేటికాలంలో ఎక్కువవుతున్నారనే చెప్పాలి. అయితే ఇందుకు మారుతున్న కాలంతో అంతగా కలవలేకున్న పెద్దల ఆలోచనలా? మారుతున్న పిల్లల ఆలోచనలా? అని ఆలోచించేకంటే వాటివెనకున్న వృద్ధుల సమస్యల తాలూకు పలు ప్రశ్నలకు సమాధానాలను తెలిపే ప్రయత్నం చేశారు ప్రముఖ రచయిత సుధామ ఈ 'జీవన సంధ్య' పుస్తకంలో. వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ మాసపత్రికలో మూడు సంవత్సరాలు సీ'ని'యర్ కబుర్లు' పేరుతో రచయిత సుధామ నిర్వహించిన కాలమ్‌లో వయోపౌరులకు సంబంధించి ఆరోగ్య, ఆర్థిక, ఆధ్యాత్మిక, దాంపత్య, సామాజిక అంశాలపై అందించిన వ్యాసపరంపరే 'జీవనసంధ్య' పుస్తకంగా పాఠకులను పలకరిస్తోంది. 41 వ్యాసాలున్న ఇందులో ప్రతి వ్యాసం వయోపౌరులకు సంబంధించిన అమూల్యమైన విషయాలే.

తొలి వ్యాసం 'తలపోతల వ్యాయామం'. ఇందులో వృద్ధాప్యంలో అందరూ జ్ఞాపకాలను తలచుకోవడంతోనే ఎక్కువ సమయం గడుపుతారు. ఈ వయసులో ఎక్కువగా అల్జీమర్స్ వంటి మతిమరుపు లక్షణాలు వచ్చే అవకాశాలే ఎక్కువ. అలాకాకుండా ఉండటం కోసం జ్ఞాపకశక్తిని పదిలపరచుకోవడం కోసం మాటల ద్వారా, రాతల ద్వారా, మననం ద్వారా మంచి జ్ఞాపకాలను పదిలపరచుకోవచ్చు. అది వారికే కాదు కుటుంబసభ్యులకు సైతం ఉత్తమం. అనారోగ్యానికి గురిచేసే వాటిలో ఒత్తిడి మరొకటి. ఎటువంటి ఒత్తిడులులేని జీవితం గడపడం ఎవరికైనా సాధ్యంకాని పని. కొందరు పెద్ద వయసులో మొహమాటంతో పనులు చేసి ఇబ్బంది పడుతుంటారు. అందుకని మొహమాటం అనేది అనవసరం. పరిమితులు తెలుసుకుని సామర్థ్యం, వయసుకి మించి అదనపు బాధ్యతలు ఒప్పుకోకుండా ఉండటం శ్రేయస్కరం. తమని తాము నియంత్రించుకుని, క్రమబద్ధీకరించుకోవడం ద్వారా ఒత్తిడి దరిచేరక ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

ఒక్కోసారి కన్నవారి హృదయపూర్వకమైన ప్రేమాదరణలు అందని అభాగ్యులైన వృద్ధులకు వృద్ధాశ్రమాలే ఒకవిధంగా భాగ్యాలయాలని చెప్పాలి. ఎందుకంటే అనునిత్యం మానసిక, శారీరక హింస అనుభవిస్తూ కడవరకు జీవితాన్ని గడిపేకంటే ఉన్నంతలో ఆదరణగా చూసి ప్రేమనందించే వృద్ధాశ్రమాలు మేలేకదా. కొంతమంది పెద్దలు, సేవాతత్పరులు ఆర్థికపరంగా, సేవాపరంగా తమ వంతు సహకారాన్ని అందించడం ద్వారా ఎంతోమంది వృద్ధులు చివరిదశలో అన్ని మరచి ప్రశాంతజీవనం సాగిస్తున్నారు వృద్ధాశ్రమాల్లో.

ఇలా ఎన్నో వ్యాసాల్లో వృద్ధుల సమస్యల గురించి, వారి ఆలోచనల గురించి, వారనుభవిస్తున్న మనోవేదన, ఇబ్బందుల గురించి వారు తమలో మార్చుకోవాల్సిన అలవాట్ల గురించి తెలియజేశారు. ముఖ్యంగా వృద్ధులనగానే కొంతమందిలో చులకనభావం ఉంటుంది. అందుకే చాలామంది వృద్ధులు నేటితరానికి మా అనుభవాలు అవసరం లేదన్న భావన ఉందంటారు. నిజానికి కొందరిలో ఆ భావన ఉన్న మాట నిజమే అయినా తాము చెప్పిందే నిజమని పట్టుబట్టే కొంతమంది వృద్ధులవల్ల వారటువంటి భావనతో ఉంటుంటారు. అయితే మీ జీవితమే మీ సందేశం కావాలి అంటారు రచయిత. ఫలితాల గురించి ఆలోచించకుండా తమకుతోచిన ఉపయుక్తమైన పనులను చేసుకుంటూ పోవడమే ప్రశాంత వృద్ధాప్య జీవనానికి మంచిసోపాన మంటారు. కాలంతో పరిపక్వమై తనను తాను తెలుసుకుంటూ జీవనం సాగించడమే జీవనసారం. ఇది కేవలం వృద్ధులకే కాకుండా వృద్ధాప్యానికి దగ్గరయ్యేవారు సైతం తెలుసుకోవడం ఉత్తమం. మనసులోని మాటలో 'ఈ లోకంలో సజీవుడైన మనుష్యుని మినహా అంతగా వింతగొల్పే అమూల్యవస్తువు పుస్తకం మాత్రమే' అని చెబుతారు. ఆ రీతిన సుధామగారి ఈ 'జీవన సంధ్య' పుస్తకం వయోపౌరులకు ఓ అమూల్యమని చెప్పకతప్పదు. యువతరం సైతం ఈ జీవన సంధ్యను చదవడం ద్వారా వయోపౌరుల ఆలోచనలను, భావాలను, బాధలను తెలుసుకుని వారికి, వారి ఆలోచనలకు తమ వంతు చేయూతనందించే వీలు కలుగుతుందని చెప్పొచ్చు. వృద్ధుల ఆలోచనలకు, ఆవేదనకు అక్షరరూపు కట్టిన ఈ జీవనసంధ్య నేటితరం సైతం తప్పక చదవవలసిన పుస్తకం.

-జె.బి.

గ్రంథ సమీక్ష



జీవన సంధ్య - వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్
సుధామ
వెల:రూ.120/-, పేజీలు: 144
ప్రతులకు: ఎ. ఉషారాణి, ఇ-107,
రాజపుష్ప అట్రియా
గోల్డెన్ మైల్ రోడ్
కోకాపేట్, హైదరాబాద్-500075. మరియు
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో

అందరూ చదవాల్సిన విశ్లేషణాత్మక పుస్తకం

డాక్టర్ కె.నారాయణ
సీపీఐ జాతీయ కార్యదర్శి, మొబైల్ :9490952222

ఇటీవల ఎమెస్కో సంస్థ ప్రచురించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు ఆత్మకథ "బ్రేకింగ్ బారియర్స్ "పుస్తకాన్ని ఆసాంతం చదివాను. విజయవాడలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభకు నేను కూడా హాజరయ్యాను. ఆ సభలో నాకు కూడా మాట్లాడే అవకాశం లభించింది.. ఎంతో విలువైన ఈ పుస్తకాన్ని తీసుకువచ్చిన ఎమ్మెస్కో విజయ్ కుమార్‌కి, కాకి మాధవరావుకి ప్రత్యేక అభినందనలు. రిటైర్ అయిన ఒక ఐఏఎస్ అధికారి రాసిన ఆత్మకథకు ప్రాముఖ్యత ఉంటుంది. అందులోనూ ఎమెస్కో లాంటి సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మాధవరావు కుటుంబం, కింది స్థాయి నుంచి ఆయన ఎదిగిన తీరును ఎంతో చక్కగా వివరించారు. మాధవరావు తల్లి నిరక్షరాస్యులు. కానీ ఎంతో సాహసోపేతంగా వెట్టిచాకిరి విధానాన్ని అధిగమించి మాధవరావును చదివించడం ఆరోజుల్లో ఒక విప్లవాత్మక మార్పుగా చెప్పుకోవచ్చు. నాకు ఆనాటి దయనీయ పరిస్థితుల మీద అవగాహన ఉంది. ఎందుకంటే సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో అత్యధికులు దళిత గిరిజన విద్యార్థులే బోర్డర్లుగా ఉంటారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా వారి దయనీయ పరిస్థితులపై అవగాహన ఉన్నది. అణగారిన విద్యార్థులను ముందుకు తీసుకువెళ్లేందుకు ఏఐఎస్ఎఫ్ ప్రత్యేక దృష్టి పెట్టేది.

కాకి మాధవరావును ఐఏఎస్ అధికారిగా చూసేందుకు ఆయన తల్లి పడిన కష్టాలు, కృషి కళ్లకు కట్టినట్టుగా ఈ పుస్తకంలో ఉంది. మాధవరావు ఐఏఎస్ అధికారిగా ఎంపికైన తర్వాత అప్పటివరకు పడిన కష్టాలు చాలు, ఇకపై జీవితాన్ని అనుభవిం చాలని ఎన్నడూ అనుకోలేదు. అలా అనుకుంటే ఈ పుస్తకం వచ్చేదే కాదు.

ఆయన వచ్చిన నేపథ్యం కారణంగా ఐఏఎస్ అధికారి అయ్యాక మాధవరావు పేద వర్గాల పక్షపాతిగా ఉన్నారని ఒక వాదన ఉన్నది. దాంతో నేను ఏకీభవించను. ఎందుకంటే నా 50 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేకమంది పేదరికంలో జన్మించి, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ యితర ఉన్నతాధికా రులు అయిన వారిని చూశాను. వారిలో మాధవరావు "కాకిలలో కోయిల వంటి వారు" అనడంలో ఎలాంటి సందేహం లేదు. అదే సమయంలో అగ్రవర్ణాల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులను పేద వర్గాల వ్యతిరేకులుగా ముద్ర వేయడం కూడా సమంజసం కాదు. ఎందుకంటే నాగార్జున అనే ఉన్నత వర్గానికి చెందిన ఐఏఎస్ అధికారి నిరుపేదల కోసం మనసా వాచా పనిచేశారు. దీంతో ఆయన అనేక మార్లు వేధింపులు, అక్రమ బదిలీలకు గురయ్యారు దీనికి వ్యతిరేకంగా "నిజాయితీ అధికారుల అక్రమబదిలీల వ్యతిరేక పోరాట కమిటీ"ని ఏర్పాటు చేసి మేము పోరాడిన రోజులు కూడా ఉన్నాయి. అప్పట్లో నాగార్జున అక్రమ బదిలీకి వ్యతి రేకంగా జిల్లా బంద్, చలో అసెంబ్లీ కార్యక్రమాలు కూడా నిర్వహించాం. కళారంగానికే పరిమిత మయిన కీ.శే. శివప్ర సాద్ ఆ ఉద్యమంలోనే మొదటి సారిగా బహిరంగ పోరాటరంగంలోకి వచ్చి రాజకీయ రంగంలో రాటు తేలారు.

ఎవరైనా సరే న్యాయం కోసం, న్యాయం తరఫున ఉంటే వారిపై కమ్యూనిస్టు లేదా నక్సలైట్ అనే ముద్ర వేసేవారు. కాకి మాధవరావు కలెక్టర్‌గా ఉన్న సమయంలో "దున్నేవానికే భూమి", " గీసే వానికే చెట్టు" అమలు కోసం యజ్ఞంలా పని చేశారు. తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ బలంగా వేళ్లూను కున్న రోజుల్లో ఆయన వరంగల్ జిల్లాలో పనిచేసినప్పుడు అనేక ఆటంకాలు ఎదుర్కోవడమే కాకుండా నక్సలైట్ సానుభూతిపరులు అనే ముద్ర కూడా ఎదుర్కొన్నారు. ఆయన గురించి రాష్ట్రపతి స్థాయి వరకు కూడా వెళ్లింది. ఉద్యోగానికి గండం ఏర్పడిందని ఆనాటి ప్రముఖులు కేవీ రఘునాథరెడ్డి ఆందోళనపడిన ఘటన మాధవరావు పుస్తకంలో కనబరిచారు. చివరికి ఆనాటి ప్రజాస్వామ్యం కొంతయినా బతికుంది కాబట్టే గండం నుంచి బయటపడి చివరాంకం వరకు ఉన్నత స్థాయి నుంచే పదవీ విరమణ చేశారు. అయినా సామాజిక జీవితం దళిత బహుజనుల కొరకు తనదైన శైలిలో గళం వినిపిస్తూనే వున్నారు.

ఈ సందర్భంగా ఒక ఘటన చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తదితర అంశాలపై దళిత పోరాట కమిటీ అధ్వర్యంలో నాగపూర్‌లో జాతీయస్థాయి సమావేశం సీపీఐ చొరవతో జరిగింది, ఆనాటి సీపీఐ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్, సురవరం సుధాకరరెడ్డి తోపాటు కాకిమాధవరావు, మల్లేపల్లి లక్ష్మయ్య కూడా హాజరై తగిన సలహాలిచ్చారు. మాధవరావు మాటలు మృదువుగా ఉన్నప్పటికీ ప్రజల మంచి కోసం నిలబడడంలో అత్యంత దృఢంగా వ్యవహరించేవారు. మాధవరావు చేసిన పనిలో ఇరవై శాతం ఇప్పటి ఉన్నతాధికారులు చేసినా నేనెంతో సంతోషించే వాడిని. వారి వారి విలువల కోసం నిలబడి నట్టైతే వారి జీవితం ఫలప్రదమవుతుంది. అలా కాకుంటే వారు పొందిన పట్టాలకే ద్రోహం చేసిన వారుగా జీవితాంతం మిగిలిపోతారు. ఉన్నతాధికారులు తాము ఎలాంటి జీవితం గడపాలో నిర్ణయించుకోవాలి.



మాధవరావు ప్రత్యేకత ఏమిటంటే అందుబాటులో ఉన్న చట్టాల తోటే ఆటవికంగా సంపదను దోచుకునే కార్పొరేట్ తిమింగలాలను బహిర్గతం చేసేవారు. అమానవీయమైన కోవిడ్ మహమ్మారి కరాళ నృత్యం చేసిన రోజుల్లో కూడా భారత కార్పొరేట్ రాక్షసులు కనీస నైతిక విలువలను పక్కనపెట్టి కోట్ల రూపాయలు వెనకేసుకుని ప్రపంచ శతకోటీశ్వరుల జాబితాలో మొదటి మూడు నాలుగు స్థానాల కోసం పోటీపడ్డారు. పుస్తకం చివరి చాప్టర్ చివరిలో రాజ్యాంగాన్ని వివరంగా విపులీకరించి, అవసరమైన చట్టాల గురించి మాధవరావు చక్కగా తెలియపరిచారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి ఓటు హక్కును కల్పించింది. ఈ హక్కుతో నీవు తలెత్తుకొని జీవిస్తావో లేదా మోసాలపై నిలబడే జీవిస్తావో అనేది ఎవరికి వారే నిర్ణయిం చుకోవాలి. ఏడు దశాబ్దాల క్రితం మహానుభావుడు అంబేద్కర్ ఇచ్చిన సందేశం ఇది. కానీ ఇప్పుడున్న మన పరిస్థితి ఏంటి? ఇంకా ప్రభుత్వాలు కార్పొరేటర్ రాక్షసుల ముందే తలవంచుకొని ఎందుకు నిలబడుతున్నాయి.

పుస్తకంలో కొన్ని పేజీలలో అంశాలు

మాధవరావు రాసిన పుస్తకంలోని 314 పేజీలో ఆర్థిక రాజకీయ వ్యవస్థలో ఉన్నత కులాలకు చెందినవారు ఏ విధంగా ఏకచిత్రాధిపత్యం వహిస్తున్నారనేది టేబుల్ రూపంలో సవివరంగా పేర్కొన్నారు. అలాగే గ్రామాలలో పేదలు దళితులు ఇప్పటికీ ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడిని చక్కగా వివరించారు. కార్పొరేట్ బోర్డు సభ్యుల పొందికలో సైతం అగ్రవర్ణ కులాలకు చెందినవారే మొత్తం ఆధిపత్యం వహించడానికి కళ్లకు కట్టినట్లుగా రాశారు.

ఇక పేజి నంబర్ 315లో బ్రిటిష్ పాలకులు భారత దేశం నుంచి రూ . 358 కోట్ల కోట్లు సంపదను దోచుకెళ్లినట్లు తెలిపారు థామస్ పికెట్టి, లూకాస్ ఛాన్స్ చేసిన అధ్యయనం ప్రకారం 1922 నుండి 2014 వరకు 92 సంవత్సరా లలో ఆదాయం, సంపద మధ్య అసమానతలు తీవ్రమవుతున్నాయి అని, ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారని, పేదలు, మధ్యతరగతి ప్రజలు మరింత పేదరికంలోకి నెట్టి వేయబెడుతున్నారని తెలియజేశారు.

ఇక పేజీ 316 లో కోవిడ్ మహమ్మారి సమయంలో, అనగా 2021లో శతకోటీశ్వరుల సంఖ్య 39 శాతానికి పెరగగా, 84% కుటుంబాలు తమ ఆదాయాలు, కొనుగోలు శక్తిని విపరీతంగా కోల్పోయాయని వివరించారు. అలాగే పేజీ నంబర్ 317, 318లో ఆక్స్‌ఫామ్ 2022 నివేదికను ఉటంకిస్తూ ఆదాయ సంపదలో గోచరిస్తున్న స్పష్టమైన అసమానతల గురించి వివరించారు. ఆదాయం , సంపద వనరులను అందరికి అందుబాటులో ఉంచడంలో అసమాన తలు సరైనది కాదు, ముఖ్యంగా భారతదేశంలో అధికార పార్టీ మద్దతు సహకారంతో కొంతమందికి మాత్రమే సంపద ఆదాయాలు సొంతమవుతున్నాయి. రాజ్యాంగం లోని 38, 39 అధికరణల ప్రకారం ఆదాయ అసమానతలు తగ్గించాలని, దేశ సంపదపై అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టంగా ఉన్నట్లు తెలియజేశారు. ఆర్టికల్ 39బి లో సమాజంలోని వనరులను ఉమ్మడి మంచి కోసం ప్రభుత్వం పంపిణీ చేసే విధంగా విధానాలను రూపొందించాలని స్పష్టంగా ఉన్నది. ఆర్టికల్ 39 సీలో ఆర్థిక వ్యవస్థలోని చర్యలు సంపద, ఉత్పత్తి సాధనాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతం అయ్యే విధంగా ఉండకూడదని పేర్కొంది.

ప్రభుత్వాలు 1991 నుంచి అనుసరిస్తున్న పన్ను విధానమే పెరుగుతున్న అసమానతలకు కారణమని పేర్కొ న్నారు. ప్రోగ్రెసివ్ పన్ను విధానం ద్వారా ఆదాయం, సంపద సమానత్వాన్ని సాధించవచ్చు. ఈ విధానంలో ధనవంతులకు ఎక్కువ పన్ను, తక్కువ ఆదాయం ఉన్నవారికి తక్కువ పన్ను వేస్తారు. అయితే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే ప్రైవేటు రంగం నిరంతరం ప్రభుత్వాలను ప్రభావితం చేస్తూ మరింత తిరోగమన పన్ను విధానాలను తీసుకువచ్చేలా చేస్తోంది. భారతదేశంలో ప్రస్తుత కార్పొరేట్ పన్ను 22%, ఆదాయపన్ను 30 శాతం ఉన్నది. కార్పొరేట్ పన్ను ఇతర పెట్టుబడి దేశాల కంటే భారత దేశంలోనే తక్కువ. వారసత్వ పన్ను విధించని 19 ప్రపంచ దేశాలలో భారతదేశం ఒకటి .

పుస్తకంలోని పేజి నంబర్ 320లో కాకి మాధవరావు ఇలా అంటారు. రాజ్యాంగబద్ధంగా భారతదేశం సోషలిస్టు దేశంగా వ్యవహరించడం తప్పనిసరి, కానీ అమలులో మాత్రం పెట్టుబడి దారి దేశాల కంటే ఘోరంగా ఉన్నాం. రాజ్యాం గ పీఠిక, రాజ్యాంగంలోని 38 39వ అధికరణలో పేర్కొన్న ఆదేశిక సూత్రాలను గౌరవించడంలో ఎన్నికైన ప్రభుత్వాలు వరుసగా విఫలమవుతున్నాయి.

ఇంతటి సమాచార, విశ్లేషణాత్మక పుస్తకం మరింత జనబాహుళ్యంలోకి వెళ్లాల్సిన అవసరం ఉన్నది.

బీజేపీని వణికిస్తున్న 'ప్రగతిశీల కూటమి'

- త్రిపురలో అధికార కూటమిని వీడుతున్న ఎమ్మెల్యేలు
- ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజావ్యతిరేకత
- పుంజుకుంటున్న వామపక్షాలు

అగర్తల: నాలుగు ఈశాన్య రాష్ట్రాల (త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం) అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్నాయి. వీటిల్లో మిజోరం మినహా మిగిలిన మూడు రాష్ట్రాల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయి. త్రిపుర ప్రాంతీయ ప్రగతిశీల కూటమి త్రిపురలో బీజేపీ నేతృత్వంలోని అధికార కూటమిని వణికిస్తున్నది. ఇటీవల కాలంలో బీజేపీకి వరుసగా ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తున్నారు. ఎన్నికల దగ్గర పడుతున్న తరుణంలో కీలక నేతలు ఒక్కొక్కరిగా చేజారుతుండటం ఆ పార్టీ నేతలను కలవరపరుస్తున్నది. మరోవైపు కొత్తగా పుట్టుకొచ్చిన త్రిపుర ప్రాంతీయ ప్రగతిశీల కూటమి పాలక బీజేపీకి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. రాజకీయంగా కాంగ్రెస్ మూలాలున్న రాజవంశానికి చెందిన ప్రద్యోత్ కిశోర్ దేవ్ బర్మన్ నేతృత్వంలోని ఈ కొత్త పార్టీ కమలనాథులకు కొరకురాని కొయ్యగా తయారైంది. ప్రద్యోత్ కిశోర్ దేవ్ బర్మన్ త్రిపుర చివరి రాజు అయిన కిరిట్ విక్రమ్ దేవ్ బర్మన్, బింబు కుమారి దేవ్ కుమారుడు. బింబు కుమారి 1989 నుంచి 1991 వరకు త్రిపురలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మంత్రిగా, పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేశారు.

త్రిపుర కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన అనుభవం ప్రద్యోత్‌కు ఉన్నది. త్రిపుర గిరిజన ప్రాంత ప్రత్యేక ప్రతిపత్తి జిల్లా సమితికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ కూటమి సత్తా చాటింది. 28 సీట్లలో 18 సీట్లు గెలుచుకొని బీజేపీ నేతృత్వంలోని త్రిపుర ప్రాంతీయ పీపుల్స్ ఫ్రంట్‌ను కంగు తినిపించింది. త్రిపుర జనాభాలో మూడింట ఒక వంతు ప్రజలు ఆదివాసీలు. ఆదే తెగకు చెందిన రాజవంశీయుల కుటుంబానికి చెందిన ప్రద్యోత్ కిశోర్‌ను స్థానిక ప్రజలు తమ మూలాల నుంచి వచ్చిన నేతగా ఆదరిస్తున్నారు. త్రిపురలో ప్రాంతీయ ప్రత్యేక ప్రతిపత్తి కౌన్సిల్ పరిధిలోని భూభాగంలో మూడింట రెండు వంతులు ప్రద్యోత్ పార్టీ కైవసం చేసుకోవడం బీజేపీని ఆందోళనకు గురిచేస్తున్నది. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభావం ఉంటుందని కలవరం చెందుతున్నది. మరో పక్క రాష్ట్రంలో వామపక్షాలు బలాన్ని పుంజుకోవడం, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత కూడా బీజేపీని వణికిస్తోంది.

'మిషన్ 929'తో త్రిపురలో 90 శాతానికిపైగా పోలింగే ఈసీ లక్ష్యం

అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు త్వరలోనే జరగబోతున్నాయి. దీంతో ఎన్నికల కమిషన్ (ఈసీ) ఈ రాష్ట్రంలో 929 పోలింగ్ బూత్‌లపై దృష్టిని కేంద్రీకరించి ఓటింగ్ లక్ష్యాన్ని 92శాతంగా నిర్దేశించినట్లు ఓ అధికారి ఆదివారం తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 3,328 బూత్‌లలో 89 శాతం కంటే తక్కువ పోలింగ్ జరిగిం దని అన్నారు. ఆ బూత్‌లలో పోలింగ్ శాతాన్ని పెంచే ఉద్దేశంతో మిషన్ 929ని ఈసీ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఓటర్లలో అవగాహన పెంచడమే కాకుండా వృద్ధులు, దివ్యాంగుల వద్దకు పోలింగ్ అధికారులు వెళ్లి వారితో ఓటు వేయిస్తారని అధికారి తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద సీనియర్ సిటిజెన్స్, దివ్యాంగుల కోసం ర్యాంపులు, చక్రాల కుర్చీలు, వేరుగా క్యూలైన్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కూడా ఉంటాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని 'మిషన్ జీరో ఎన్నికల హింస'దిశగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని అధికారి చెప్పారు. అవాంఛనీయ ఘటనల నివారణకు విస్తృత ప్రణాళికర రూపొందిందన్నారు. ఈ మిషన్ విజయం కోసం అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని కూడా ఆయన చెప్పారు. పండగ పూట ఎన్నికలు జరుగుతున్నాగానీ హింస చోటు చేసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కేంద్ర దళాల 50 కంపెనీలను ఇప్పటికే రాష్ట్రంలో మోహరించగా, ఎన్నికల సమయానికి మరో 50 కంపెనీలు రంగంలోకి దిగుతాయని ఆయనన్నారు.

ప్రభుత్వోద్యోగులకు డీఏ పెంపు

తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై: తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు కరవుభత్యం పెరిగింది. డీఏను 34శాతం నుంచి 38శాతానికి పెంచుతున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం ప్రకటించారు. జనవరి ఒకటో తేదీ నుంచే కొత్త డీఏ అమలవు తుందన్నారు. డీఏ పెంపుదల నూతన సంవత్స రం కానుక అని అన్నారు. ఈ నిర్ణయంతో టీచర్లు, పింఛన్‌దారులు, కుటుంబ ఫించన్‌దారులతో పాటు 16 లక్షల మంది సిబ్బందికి లబ్ధి చేకూరుతుందన్నారు. అయితే ప్రభుత్వ ఖజానాపై అదనంగా రూ.2,359 కోట్ల భారం పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం దానిని భరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధమేనని స్టాలిన్ తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కోసం ప్రభుత్వ టీచర్ల ఆందోళనపై స్పందిస్తూ ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఆర్థికశాఖ కార్యదర్శి (వ్యయం) అధ్యక్షతన ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారు. ఈ ప్యానల్ చేసే సిఫార్సుల ఆధారంగా దీనిపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ప్రజల సంక్షేమం, సమృద్ధి లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని, అందుకోసం పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఉద్యోగులను స్టాలిన్ కోరారు.

ప్రధాని మోదీ తల్లి స్మారకార్థం ప్రార్థనలు

హాజరైన రాజకీయ నేతలు, శ్రేయోభిలాషులు

మెహసానా: గుజరాత్‌లోని ప్రధాని జన్మస్థలం వాద్‌నగర్‌లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ స్మారకార్థం ఏర్పాటు చేసిన ప్రార్థనా సమావేశానికి పెద్ద సంఖ్యలో రాజకీయ నేతలు, శ్రేయోభిలాషులు హాజర య్యారు. హీరాబెన్ (99) శుక్ర వారం అహ్మదాబాద్‌లో కన్నుమూశారు. ఆమెకు నివాళులర్పిస్తూ వాద్‌నగర్‌లోని వ్యాపారులు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు స్వచ్ఛందంగా మార్కెట్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాద్‌నగర్‌లోని జవహర్ నవోదయ్ విద్యాలయ హాలులో జరిగిన ప్రార్థనా సమావేశానికి గుజరాత్ అసెంబ్లీ స్పీకర్ శంకర్ చౌదరి, కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్, ఎమ్మెల్యేలు పూర్ణేష్ మోదీ, జేథా భర్వాద్ తదితరులు హాజరయ్యారు. హీరాబెన్ కుటుంబ సభ్యులు నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో బీజేపీ నాయకుడు సంజయ్ జోషి, మాజీ స్పీకర్ నిమా ఆచార్య, మాజీ ఎమ్మెల్యే మాయా కొద్నాని కూడా పాల్గొన్నారు. గుజరాత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబ శ్రేయోభిలాషులు, వారి బంధువులు, హీరాబెన్ ఆమె జీవితంలో ఎక్కువ భాగం గడిపిన వాద్‌నగర్ నివాసితులు కూడా ఆమెకు నివాళులు అర్పించేందుకు ఉదయం క్యూలో నిలబడ్డారు.



నూతన సంవత్సరం వేడుకలు
స్విగ్గీకి 3.5 లక్షల బిర్యానీల ఆర్డరు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా 3.5 లక్షల బిర్యానీ ఆర్డర్లు రాగా, వాటిలో 2.5లక్షలపైగా డెలివరీ చేసినట్లు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ తెలిపింది. అదే సమయంలో 61వేల పిజ్జాలను సైతం కస్టమర్లకు అందించినట్లు పేర్కొంది. ట్విటర్‌లో నిర్వహించిన ఓ పోల్ ప్రకారం.. శనివారం అందిన ఆర్డర్లలో 75.4 శాతం మంది హైదరాబాదీ బిర్యానీనే ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ తెలిపింది. అలాగే మరో 14.2 శాతం మంది లక్నో బిర్యానీ, 10.4 శాతం మంది కోల్‌కతా బిర్యానీని తెప్పించుకున్నట్లు పేర్కొంది. అత్యధికంగా డెలివరీ చేసిన ఆహార పదార్థాల్లో బిర్యానీయే టాప్‌లో ఉందని పేర్కొంది. శనివారం సాయంత్రం 7.20 గంటల సమయానికే 1.65 లక్షల బిర్యానీలను డెలివరీ చేసినట్లు పేర్కొంది. హైదరాబాద్‌లో బిర్యానీకి అత్యంత ప్రాచుర్యం పొందిన 'బావర్చి' రెస్టారెంట్ శనివారం రోజు నిమిషానికి రెండు బిర్యానీలు డెలివరీ చేయడం గమనార్హం. డిమాండ్‌ను అందుకునేందుకు ఈ రెస్టారెంట్ 15 టన్నుల బిర్యానీని సిద్ధం చేసినట్లు స్విగ్గీ తెలిపింది. మరోవైపు దేశవ్యాప్తంగా డోమినోస్ ఇండియాకు చెందిన 61,287 పిజ్జాలను శనివారం డెలివరీ చేసినట్లు తెలిపింది. సాయంత్రం 7 గంటల సమయానికి 1.76 లక్షల చిప్స్ ప్యాకెట్లకు ఆర్డర్ అందినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ తెలిపింది. అలాగే 9.18 గంటల వరకు 12,344 మంది కిచిడీ ఆర్డర్ చేసినట్లు వెల్లడించింది. మరోవైపు 2,757 డ్యురెక్స్ కండోమ్‌లను కూడా డెలివరీ చేసినట్లు పేర్కొంది.

హరియాణా క్రీడల మంత్రిపై

లైంగిక వేధింపుల కేసు

చండీగఢ్ : లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హరియాణా క్రీడా శాఖ మంత్రి సందీప్ సింగ్ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. నైతిక కారణాలతో ఈ చర్య తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి చెందిన మహిళా జూనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసిన ఒక రోజు తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ అయిన 36 ఏళ్ల సింగ్ పై అక్రమ నిర్బంధం, నేరపూరిత బెదిరింపులకు కూడా అభియోగాలు మోపారు. కోచ్ తన ప్రతిష్ఠను దిగజార్చారంటూ మంత్రి ఫిర్యాదు చేయడంతో శనివారం హరియాణా పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక ఇచ్చే వరకు నైతిక ప్రాతిపదికన తన క్రీడా శాఖను ముఖ్యమంత్రికి అప్పగిస్తున్నట్లు సింగ్ తెలిపారు. కాగా ఆయన శాఖను వదులుకున్నారా లేదా మంత్రివర్గానికి రాజీనామా చేస్తారా అనేది వెంటనే స్పష్టంగా తెలియలేదు. ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు చేయాలన్న మంత్రి, కోచ్ చేసిన ఆరోపణలను నిరాధారమైనవని కొట్టిపారేశారు. డీజీపీ పి.కె.అగర్వాల్ శనివారం జారీ చేసిన ఉత్తర్వులలో... 'హరియాణా రాష్ట్ర, క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి సందీప్ సింగ్ నుంచి ఫిర్యాదు స్వీకరించాం' అని పేర్కొన్నారు. అయితే దీనికి సంబంధించిన ఆరోపణలు సామాజిక, ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా చక్కర్లు కొడుతుండగా, కమిటీ తక్షణమే ఈ అంశంపై లోతుగా విచారణ జరిపి నివేదికను వీలైనంత త్వరగా ఈ (డీజీపీ) కార్యాలయానికి అందజేయాలని ఆదేశించింది. చండీగఢ్ పోలీసులు సందీప్ సింగ్‌పై కేసు నమోదు చేశారు. సెక్టార్-26 పోలీస్ స్టేషన్‌లో 'భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 354, 354ఎ, 354బి, 342, 506' కింద 31.12.2022 తేదీన కేసు నమోదు చేశారు. ఈ విషయంపై దర్యాప్తు జరుగుతుంది' అని పోలీసు అధికార ప్రతినిధి తెలిపారు. మంత్రి సందీప్ సింగ్‌పై కోచ్ గురువారం లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఒక రోజు తర్వాత ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు అనుకూలంగా వ్యవహరిస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తానంటూ క్రీడల మంత్రి లైంగిక వేధింపులకు గురి చేశారని హరియాణాకు చెందిన జూనియర్ మహిళా అథ్లెట్ కోచ్ ఆరోపణలు చేశారు. తనను సంతోషంగా ఉంచితే కోరుకున్న చోట పోస్టింగ్ ఇప్పిస్తానని అన్నారని, అందుకు లొంగకపోవడం వల్ల తనని వేరే చోటుకి బదిలీ చేశారని అన్నారు. దీనిపై డీజీపీ, సీఎం, రాష్ట్ర హోం మంత్రి శాఖ కార్యాలయాలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఇటీవల మీడియా ముందు మహిళా అథ్లెట్ కోచ్ వాపోయారు. ఇలా మంత్రి సందీప్ సింగ్ చాలా మంది క్రీడాకారిణులను లైంగికంగా వేధించారని... మంత్రికి భయపడి వారెవరూ బయటికి చెప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆయనపై కేసు నమోదయింది. దీంతో మంత్రి బాధ్యతల నుంచి సందీప్ సింగ్ వైదొలినట్లు తెలుస్తోంది.

రాజీనామా...స్వతంత్ర దర్యాప్తునకు డిమాండ్

రాహుల్ వైభవం ఇలాగే కొనసాగితే

2024లో రాజకీయాల్లో మార్పు

- మోదీ, షా విద్వేషం... విభజన విత్తనాలు నాటొద్దు
- ఉద్ధవ్ శివసేన నాయకుడు సంజయ్ రౌత్

ముంబై: గత ఏడాది కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నాయకత్వానికి ఒక కొత్త 'వైభవం' వచ్చిందని, 2023లో కూడా ఇదేవిధంగా కొనసాగితే, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశం రాజకీయ మార్పును చూడవచ్చని శివసేన (ఉద్ధవ్ థాకరే) నాయకుడు సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ప్రతి ఆదివారం పార్టీ అధికారిక పత్రిక 'సామ్నా'లో రాసే తన వ్యాసంలో రౌత్ ఈ వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ బీజేపీ పై విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విద్వేష, విభజన విత్తనాలు నాటొద్దని హితవు పలికారు. రామ మందిర నిర్మాణ అంశానికి పరిష్కారం దొరికిందని తెలిపారు. ఇక దీనిని ఆసరాగా చేసుకొని ఓట్లు అడిగే పరిస్థితులు లేవని అన్నారు. ఈ నేపథ్యంలో 'లవ్ జిహాద్' అనే కొత్త అంశాన్ని బీజేపీ తెర పైకి తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ ఆయుధాన్ని వాడుకొని ఓ వర్గంలో భయాన్ని సృష్టించి తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. నటి తునీషా శర్మ, శ్రద్ధా వాకర్ హత్యలు లవ్ జిహాదీ కింద జరిగినవి కాదని వ్యాఖ్యానించారు. అయితే, మహిళలు ఏ వర్గానికి చెందిన వారైనా... వారిపై దాడులు సరికాదని అన్నారు. 2023లో దేశం భయం లేకుండా ఉంటుందని ఆశిస్తున్నట్లు రౌత్ అన్నారు. 'జరుగుతున్నది అధికార రాజకీయం. రాహుల్ గాంధీ యాత్ర విజయవంతమై దాని లక్ష్యాన్ని సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. సంకుచిత ఆలోచనా ధోరణిని విడనాడాలని మోదీ తరచూ చెబుతూ ఉంటారని అన్నారు. కానీ ఆ వైఖరి బీజేపీలోనే అధికంగా ఉందని తెలిపారు. విపక్ష పార్టీలకు ఉన్న హక్కులను గుర్తించడానికి కూడా పాలకులు సుముఖంగా లేరని విమర్శించారు. 'రాహుల్ గాంధీ నాయకత్వానికి 2022 కొత్త వైభవాన్ని ఇచ్చింది. 2023లో ఇలాగే కొనసాగితే, 2024లో (సాధారణ ఎన్నికలు) రాజకీయ మార్పును చూడగలం' అని అన్నారు. హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించడం కొత్త విభజనకు దారితీస్తుందని రౌత్ పేర్కొన్నారు. హిందువులను మేల్కొల్పడం బీజేపీ అజెండా. అయితే దీని అర్థం సమాజంలో ద్వేషం, విభజనను సృష్టించడం కాదని, నిరుద్యోగం, ధరల పెరుగుదల సమస్యలను పక్కన పెట్టారని అన్నారు.

వణికిస్తున్న చలి పులి

జైపూర్/శ్రీనగర్: రాజస్థాన్‌లోని చాలా ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. అన్ని ప్రధాన నగరాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదైందని వాతావరణ శాఖ ఆదివారం తెలిపింది. సికార్‌లోని ఫతేపూర్‌లో శనివారం రాత్రి 1 డిగ్రీ సెల్సియస్‌తో అత్యంత చలిగా ఉంది. చురులో కనిష్ట ఉష్ణోగ్రత 1.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. హనుమాన్‌గఢ్, చిత్తోర్‌గఢ్‌లో 3.3 డిగ్రీలు, సికార్‌లో 3.5 డిగ్రీలు, భిల్వారాలో 4 డిగ్రీలు, కరౌలీలో 4.2 డిగ్రీలు, అల్వార్, పిలానీలో 4.8 డిగ్రీలు, దబోక్‌లో 6 డిగ్రీలు, ఫలోడిలో 6.2, అంటా 6.3 డిగ్రీల సెల్సియస్‌లు నమోదయ్యాయి. ఇతర ప్రాంతాల్లో 6.5 డిగ్రీల నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పొగమంచు విపరీతంగా కమ్ముకుంటోంది. కొన్ని చోట్ల తీవ్రమైన చలిగాలులు వీస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొందని వాతావరణ శాఖ తెలిపింది.

గడ్డకట్టిన గుల్‌మార్గ్, పహల్గామ్

ప్రసిద్ధ పర్యాటక రిసార్ట్‌లైన గుల్‌మార్గ్, పహల్గామ్‌లు గడ్డకడుతున్నాయి. దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్, వార్షిక అమర్‌నాథ్ యాత్రకు బేస్ క్యాంప్‌గా కూడా పనిచేస్తుంది. ఇక్కడ చలి మైనస్ 9.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇదే కనిష్ట ఉష్ణోగ్రత. జమ్ముకశ్మీర్ అత్యంత శీతల ప్రదేశంగా నమోదైంది. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని గుల్‌మార్గ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 8.2 డిగ్రీల సెల్సియస్ - ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత అని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో రాబోయే కొద్ది రోజులలో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. ఇక శ్రీనగర్‌లో కనిష్టంగా 0.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కుప్వారాలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 4.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవగా, దక్షిణ కశ్మీర్‌లోని కోకెర్‌నాగ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 0.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని అధికారులు తెలిపారు.

మతసామరస్యం...

పసికందు ప్రాణాలు కాపాడిన ముస్లిం వ్యక్తి

ఛతర్‌పూర్: మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న 60 రోజుల పసికందు ప్రాణాలను కాపాడేందుకు మతాలకు అతీతంగా ఓ ముస్లిం వ్యక్తి రక్తదానం చేశాడు. శనివారం శిశువు గురించి అతనికి ఫోన్ వచ్చినప్పుడు, రఫత్ ఖాన్ (36) వెంటనే జిల్లా ఆస్పత్రికి వెళ్లాడు. నమాజ్ చేయడానికి ఖాన్ తన ఇంటి నుంచి బయలుదేరబోతున్నప్పుడు, వికాస్ గుప్తాకు ఏ పాజిటివ్ రక్తం అవసరం అని అతనికి ఫోన్ వచ్చింది. శిశువు రక్తహీనతతో బాధపడుతున్నాడని, శరీర కణజాలాలకు తగినంత ఆక్సిజన్‌ను తీసుకువెళ్లే ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాల లోపం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని వైద్యులు తెలిపారు. మనోరియాలో నివాసముంటున్న చిన్నారి తండ్రి జితేంద్ర తనకు కావాల్సిన బ్లడ్ గ్రూప్ రక్తన్ని సేకరించడంలో విఫలమైన తరువాత తనను సంప్రదించారని ఖాన్ చెప్పారు. అంతకుముందు ఆయనను ఎవరో మోసం చేసినట్టు పేర్కొన్నారు. చిన్నారికి రక్తం మివ్వడం తనకు ఆనందంగా ఉందని, ఖాన్ తెలపగా, స్థానికులు అతడిని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

పాస్‌పోర్టు అధికారి సీఐడీకి ప్రతినిధి కాదు

జమ్ముకశ్మీర్, లఢక్ హైకోర్టు వ్యాఖ్య

శ్రీనగర్: పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ తల్లికి పాస్‌పోర్టు నికారించిన వ్యవహారంలో సంబంధిత అధికారులకు జమ్ముకశ్మీర్-లఢక్ హైకోర్టు చీవాట్లు పెట్టింది. సీఐడీకి అధికార ప్రతినిధిగా పాస్‌పోర్టు అధికారి వ్యవహరించలేరంటూ మొట్టికాయలు వేసింది. మెహబూబా ముఫ్తీ తల్లి గుల్షన్ నజీర్ పిటిషన్‌ను జస్టిస్ ఎంఏ చౌదరి విచారించారు. పాస్‌పోర్టు జారీ లేక రెన్యూవల్ కోసం ఆమె అర్జీని తిరస్కరించేందుకు ఎలాంటి కారణాలు లేవని చెప్పారు. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేనప్పుడు భద్రతా కారణాల నెపంతో ఆమెకు పాస్‌పోర్టు నిరాకరించడంలో అర్థంలేదని న్యాయమూర్తి అన్నారు. పాస్‌పోర్టు చట్టం 1967లోని సెక్షన్ 6లో నిబంధనలను తోసిపుచ్చే విధంగా సీఐడీ-సీఐకే రూపొందించిన పోలీసు తనిఖీ నివేదిక ఉన్నదన్నారు. భద్రతా అంశాలతో పిటిషనర్‌కు సంబంధం లేదని, అప్పిలేట్ యంత్రాంగం, పాస్‌పోర్టు అధికారి (రెస్పాండెంట్లు) ఈ నివేదికనే పరిగణనలోకి తీసుకున్నట్లు ఉన్నదని హైకోర్టు పేర్కొంది. పాస్‌పోర్టు అధికారి ఈ వ్యవహారం మొత్తాన్ని కొత్తగా పర్యవేక్షించాలని, తాజా ఉత్తర్వులను ఆరు వారాల్లోగా జారీచేయాలని సూచిస్తూ నోటీసు జారీచేసింది.

భీమా కోరెగావ్ వార్షికోత్సవం... రాజకీయ నాయకుల హాజరు

పూణె: భీమా-కోరెగావ్ యుద్ధం 205వ వార్షికోత్సవం పురస్కరించుకుని రాజకీయ నాయకులతో సహా వందలాదిమంది ఆదివారం మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఉన్న జయస్తంభ్ సైనిక స్మారకాన్ని సందర్శించారు. జనవరి 1, 2018న జరిగిన హింసాకాండను దృష్టిలో ఉంచుకుని వేదిక వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉండటంతో మంత్రి చంద్రకాంత్ పండిట్ స్మారకాన్ని సందర్శించలేదు. ఏటా ఇదే రోజున, కోరెగావ్ భీమా యుద్ధంలో పీష్వాలకు వ్యతిరేకంగా పోరాడిన సైనికుల జ్ఞాపకార్థం బ్రిటీష్ వారు ఏర్పాటు చేసిన జయస్తంభాన్ని (విజయ స్థూపాన్ని) సందర్శిస్తారు. జనవరి 1, 2018న జరిగిన చారిత్రాత్మక యుద్ధానికి సంబంధించి 200వ సంస్మరణ సందర్భంగా భీమా కోరెగావ్ గ్రామ సమీపంలో హింస చెలరేగింది. ఇందులో ఒకరు మరణించగా, అనేక మంది గాయపడ్డారు. అయితే అంతకుముందు రోజు పూణెలో ఎల్గార్ పరిషత్ సమ్మేళంలో రెచ్చగొట్టే ప్రసంగాల కారణంగానే హింస చెలరేగిందని పోలీసులు తెలిపారు. ఆదివారం పూణె-అహ్మద్‌నగర్ రోడ్డులోని పెర్నే గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ పూలతో, దీపాలతో అలంకరించిన విజయ స్తంభం వద్దకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. స్మారక చిహ్నాన్ని సందర్శించే ప్రజల కోసం పార్కింగ్ సౌకర్యాలు, టాయిలెట్లు, నీళ్లు, బస్సు సేవలతో సహా జిల్లా యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది.

సెక్స్ వర్కర్లకు ఢిల్లీలో ఆస్పత్రి

న్యూఢిల్లీ: సెక్స్ వర్కర్లు, వారి కుటుంబాల కోసం మొట్టమొదటిసారిగా ఢిల్లీలోని రెడ్‌లైట్ ఏరియా, జీబీరోడ్‌లలో ఆస్పత్రిని ప్రారంభించారు. సెక్స్ వర్కర్ అయిన షాలిని (పేరు మార్చబడింది) మాట్లాడుతూ ఇతర క్లినిక్‌లకు వెళ్లినప్పుడు అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయింది. తాము సెక్స్ వర్కర్లమని తెలిసి వైద్యులు కూడా తమతో భిన్నంగా ప్రవర్తిస్తారని, ఇలాంటి క్లినిక్‌లు తమలాంటి వ్యక్తుల కోసమే కాబట్టి ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. సెక్స్ వర్కర్లకు, వారి కుటుంబాలకు వైద్య సదుపాయాలను అందించడానికి ఉత్కర్ష్ ఇనిషియేటివ్ సహకారంతో ఎన్‌జీఓ సేవా భారతి ఈ క్లినిక్‌ని ప్రారంభించింది. ఈ క్లినిక్‌లో ఏడుగురు వైద్యులు ఉంటారు. సేవా భారతి ఢిల్లీ ప్రావిన్స్ జనరల్ సెక్రటరీ సుశీల్ గుప్తా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇలాంటి క్లినిక్ ప్రారంభించడం ఇదే మొదటిదని, సెక్స్ వర్కర్ల గౌరవాన్ని కాపాడుతూ వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. జీబీ రోడ్ అనేది అజ్మేరీ గేట్ నుంచి లాహోర్ గేట్ వరకూ ఉన్న రహదారి. ఇది రెడ్-లైట్ జిల్లా, ఇందులో అనేక వేశ్యాగృహాలు ఉన్నాయి. దాదాపు వెయ్యిమంది సెక్స్ వర్కర్లు ఇక్కడ ఉంటున్నట్టు అంచనా.

మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పథకాన్ని పునరుద్ధరించాలి

ముంబై: మైనారిటీ విద్యార్థులకు మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్, ప్రీ-మెట్రిక్యులేషన్ స్కాలర్‌షిప్ పథకాన్ని పునరుద్దరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హుస్సేన్ దల్వాయ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది నుంచి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను సవరించి 9,10 తరగతుల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేశారని, మౌలానా ఆజాద్ ఫెలోషిప్ పథకం నిలిపివేయబడిందని రాజ్యసభ మాజీ సభ్యుడు దల్వాయ్ ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో తెలిపారు. ఈ రెండు నిర్ణయాలు మైనారిటీ వర్గాల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆయన అన్నారు. మైనారిటీలలో, ముఖ్యంగా బౌద్ధులు, ముస్లిం కమ్యూనిటీలలో ఉన్న పేదరికం కారణంగా అక్షరాస్యత రేటు తక్కువగా ఉందని దల్వాయ్ పేర్కొన్నారు. ముస్లిం బాలికల్లో అక్షరాస్యత శాతం గణనీయంగా తగ్గుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు మైనారిటీ కమ్యూనిటీలకు ప్రీ-మెట్రిక్యులేషన్ స్కాలర్‌షిప్‌లో 1 నుంచి 8 తరగతుల విద్యార్థులను చేర్చాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను పునరుద్ధరించాలని దల్వాయ్ పేర్కొన్నారు.

పంత్‌ను కాపాడిన డ్రైవర్, కండక్టర్‌లకు సత్కారం

పుష్కర్ ధామి



డెహ్రాడూన్: రూర్కీ సమీపంలో ఇటీవల ప్రమాదానికి గురైన ప్రముఖ క్రికెటర్ పంత్‌ను కాపాడిన హర్యానా రోడ్‌వేస్‌కు చెందిన బస్ డ్రైవర్, కండక్టర్‌లను సత్కరించనున్నట్టు ముఖ్యమంత్రి పుష్కర్ ధామి తెలిపారు. 'తమ ప్రాణాలను పణంగా పెట్టి క్రికెటర్ పంత్‌ను కాపాడిన హర్యానా రోడ్‌వేస్‌కు చెందిన డ్రైవర్, కండక్టర్‌లు ఇతరులకు ఆదర్శం. వారి రాష్ట్రప్రభుత్వం జనవరి 26న సత్కరిస్తుంది' అని ధామీ హాస్టల్ ప్రారంభించిన అనంతరం పేర్కొన్నారు. శుక్రవారం రూర్కీలో ఉన్న తన సొంతంటికి వెళుతున్న పంత్ కారు ఢిల్లీ-డెహ్రాడూన్ హైవే డివైడర్‌ను ఢీకొని కాలిపోయింది. అ సమ యంలో అటువైపుగా వస్తున్న బస్సు డ్రైవర్ సుశీల్ కుమార్, కండక్టర్ ప్రేమ్‌జిత్ పంత్‌ను గమనించి, అతడిని కాపాడి పోలీసులకు సమాచారం అందించారు.

శబరిమలలో శ్రీలంక ఎంపీ పూజలు

పతనంతిట్ట(కేరళ): శ్రీలంకకు చెందిన పార్లమెంట్ సభ్యుడు జీవన్ తొండమాన్ ఆదివారం కేరళలోని అయ్యప్ప ఆలయంలో పూజలు చేశారు. ఆయన మొట్టమొదటిసారిగా ఈ ఆలయాన్ని 'కన్నిస్వామి'గా సందర్శించారు. దేవాలయం వద్ద 38వేల బిస్కెట్‌ప్యాకెట్‌లకు పంపిణీ చేశారు. 'మకరవిలక్కు' పండగ కోసం శుక్రవారం ఆలయాన్ని పునఃప్రారంభించారు. దీంతో రెండోసారి దర్శనం నిమిత్తం ఆలయాన్ని ప్రారంభించనట్లయింది. మండల పూజల నిమిత్తం మొదటి దర్శనాలు నవంబర్ 17 నుంచి డిసెంబర్ 27వరకూ ఆలయాన్ని తెరిచి ఉంచారు.

పాలకొల్లు ఉద్రిక్తం

పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఉద్రిక్తత నెలకొంది. కాపు రిజర్వేషన్ కోసం మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య సోమవారం నుంచి దీక్ష చేయనున్నట్టు ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. దీక్ష చేపడితే హరిరామ జోగయ్యను తరలించేందుకు అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేశారు. డీఎస్పీ మనోహరాచారి ఆయన ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. ఎట్టి పరిస్థితుల్లో సోమవారం నుంచి దీక్ష చేస్తానని, ఒకవేళ అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌లో పెట్టినా, ఆసుపత్రిలో చేర్చినా అక్కడే దీక్ష కొనసాగిస్తానని డీఎస్పీతో హరిరామ జోగయ్య స్పష్టం చేశారు. ఆరోగ్య రీత్యా దీక్ష చేపట్టడం మంచిది కాదని డీఎస్పీ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఆయన ఇంటివద్దకు కాపు సంక్షేమ సేన నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. హరిరామ జోగయ్యను అరెస్టు చేస్తారనే ప్రచారం జరగడంతో.. అక్కడే ఉన్న పోలీసులు, రెవెన్యూ అధికారులతో కార్యాకర్తలు వాగ్వాదానికి దిగారు.

డిసెంబరులో 15శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ: వస్తువులు-సేవల పన్ను (జీఎస్టీ) 2022 డిసెంబరులో 15శాతం పెరిగి రూ.1.49 లక్షలకోట్లకుపైగా నమోదైంది. ఉత్పత్తి, వినియోగ డిమాండు మెరుగుదలను ఈ పెంపు సూచిస్తున్నది. వరుసగా పదో నెలలో రూ.1.40లక్షల కోట్లకుపైగా పన్ను ఆదాయం వచ్చింది. నవంబరులో జీఎస్టీ వసూళ్లు రూ.1.46లక్షల కోట్లు కాగా స్థూల జీఎస్టీ ఆదాయం 2022 డిసెంబరులో రూ.1,49,507 కోట్లు అని ఆర్థికశాఖ ప్రకటన తెలిపింది. ఇందులో నుంచి రూ.26,711 కోట్లు సీజీఎస్టీ కాగా రూ.33,357 కోట్లు ఎస్‌జీఎస్టీ, రూ.78,434 కోట్లు (దిగుమతి వస్తువులపై రూ.40,263కోట్లు కలిపి) ఐజీఎస్టీ, సెస్ రూ.11,005 కోట్లు (దిగుమతి వస్తువులపై వసూలైన రూ.850కోట్లు సహా) అని పేర్కొంది. డిసెంబరులో దేశీయ జీఎస్టీ ఆదాయం 15శాతం పెరిగి రూ.1.49లక్షల కోట్లకు చేరిందని, గతేడాది ఇదే నెలలో రూ.1.30లక్షల కోట్లు వసూలైనట్లు ప్రకటన తెలిపింది. ఈనెలలో దిగుమతి వస్తువులపై ఆదాయం ఎనిమిది శాతం అధికం కాగా దేశీయ లావాదేవీలు (దిగుమతి సేవలు సహా) 18శాతం ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. 2022 నవంబరులో 7.9కోట్లు ఈ-వే బిల్లులు జనరేట్ కాగా అక్టోబరులో 7.6 కోట్లు ఈ-వే బిల్లులు జారీ అయ్యాయని ప్రకటన వెల్లడించింది. ఇదిలావుంటే, ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్ల రికార్డు నమోదైంది. రూ1.68లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. అలాగే మేలో రూ.1.41లక్షలకోట్లు రాగా జూన్‌లో రూ.1.45లక్షలకోట్లు, జులైలో రూ.1.49 లక్షలకోట్లు, ఆగస్టులో రూ.1.44లక్షల కోట్లు, సెప్టెంబరులో రూ.1.48 లక్షలకోట్లు, అక్టోబరులో రూ.1.52లక్షలకోట్లు, నవంబరులో రూ.1.46లక్షల కోట్లు, డిసెంబరులో రూ.149లక్షల కోట్లు చొప్పున వసూళ్లు జరిగాయి.

కొత్త జాతిపిత దేశం కోసం ఏం చేశారు: నితీశ్

పాట్నా: ప్రధాని మోదీపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆదివారం విమర్శలు సంధించారు. 'న్యూ ఇండియా కొత్త జాతి పిత దేశం కోసం ఏమిచేశారు' అంటూ ఎద్దేవా చేశారు. ఇటీవల మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృత ఫడ్నవీస్ ప్రధాని మోదీని 'న్యూ ఇండియా ఫాదర్ ఆఫ్ నేషన్' అని ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై నితీశ్ కుమార్ సెటైరికల్‌గా స్పందించారు. కొత్త జాతిపిత దేశానికి ఏం చేశారని ప్రశ్నించారు. స్వాతంత్ర్య పోరాటంతో ఆర్ఎస్ఎస్‌కు సంబంధం లేదని.. ప్రధాని మోదీని న్యూ ఫాదర్ ఆఫ్ నేషన్ అని ప్రశంసించడం ఇటీవల చదివానని.. మరి దేశంకోసం కొత్త జాతిపిత ఏం చేశారో చెప్పాలని అన్నారు. మహాత్మా గాంధీని ఎవరితో పోల్చలేమని మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే పేర్కొన్నారు. కొద్దిమంది ధనవంతులైన మిత్రుల కోసమే బీజేపీ నవభారతమని అన్నారు. భారతదేశంలో చాలా మంది ఆకలితో బాధపడుతున్నారని.. మాకు కొత్త భారత దేశం అవసరం లేదని ఆయన అన్నారు. కొంతమంది ధనవంతులైన వ్యాపారవేత్తల కోసం వారు మోదీజీని 'నేషన్ ఆఫ్ ది నేషన్'గా మార్చాలనుకుంటే, మార్చుకోండి .. అందుకు నేను వారిని అభినందిస్తున్నానని వ్యాఖ్యానించారు.

'టయోటా డేటాబేస్'పై సైబర్ దాడి

న్యూఢిల్లీ: ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ డేటాబేస్‌పై సైబర్ దాడి జరిగింది. కంపెనీ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు వినియోగదారుల వ్యక్తిగత డేటా వివరాలను తస్కరించారు. అయితే, హ్యాకర్స్ ఎంత సమాచారాన్ని సేకరించారనే దానిపై వివరాలను సేకరిస్తున్నామని కంపెనీ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. 'టయోటా కిర్లోస్కర్‌కు అనుబంధంగా పనిచేసే ఓ సంస్థ మా కంపెనీ డేటాబేస్‌పై సైబర్ దాడి జరిగినట్లు మాకు తెలియజేసింది. ఈ దాడిలో టయోటా వినియోగదారుల వ్యక్తిగత సమాచారం బహిర్గతం అయినట్లు భావిస్తున్నాం. సైబర్ నేరగాళ్లు ఎంత సమాచారాన్ని సేకరించారు? కంపెనీ సర్వర్లో ఎంత వరకు చేరుకోగలిగారనే దానిపై విచారణ జరుపుతున్నాం' అని కంపెనీ పేర్కొంది. టయోటో కిర్లోస్కర్ సర్వర్‌పై దాడి విషయాన్ని భారత ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ.. కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా (సీఈఆర్‌టీ-ఇన్) కూడా ధ్రువీకరించింది. సైబర్‌దాడి నేపథ్యంలో తమ సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. వినియోగదారుల వ్యక్తిగత సమాచారానికి భద్రత కల్పించేందుకు కంపెనీ నిరంతర కృషి చేస్తుందని, వారికి కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మరోవైపు గతేడాది కార్ల అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి నమోదు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. 2021లో కంపెనీ మొత్తంగా 1,30, 768 కార్లను విక్రయించగా, 2022లో 22.6 శాతం పెరిగి, 1,60, 352 కార్లు అమ్ముడైనట్లు తెలిపింది. గత పదేళ్లలో టయోటా కిర్లోస్కర్‌కు ఇదే అత్యుత్తమ రికార్డు అని కంపెనీ చెప్పింది. 2012లో అధికంగా 1,72,241 కార్లను విక్రయించగా, ఆ తర్వాత ఈ ఏడాది నమోదైన గణాంకాలు అత్యుత్తమైనవిగా కంపెనీ పేర్కొంది.

బాణసంచా పేలుడు... ఐదుగురి మృతి

- మరో 10 మందికి గాయాలు
- షోలాపూర్ ఫ్యాక్టరీలో ఘటన
- నాసిక్‌లో పాలిథిన్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం : ఇద్దరి మృతి

షోలాపూర్: మహారాష్ట్రలోని నూతన సంవత్సరం రోజు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. షోలాపూర్‌లో బర్షి గ్రామం వద్ద ఒక బాణసంచా తయారీ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం కారణంగా భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం ఐదుగురు మృతి చెందగా, మరో 10 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే, సహాయక చర్యలు చేపట్టేందుకు నాలుగు అగ్నిమాపక వాహనాలు, పోలీసులు, సహాయక బృందాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఫ్యాక్టరీలో మంటలు చెలరేగిన నేపథ్యంలో భారీ పేలుడు సంభవించిందని, ఆ సమ యంలో బాణసంచా తయారీలో కనీసం 40 మంది కార్మికులు నిమగ్నమై ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే ప్రమాద స్థలం నుంచి కనీసం 9 మృతదేహాలను వెలికి తీశారని స్థానికులు పేర్కొంటున్నప్పటికీ, అధికారులు మాత్రం దానిని ధ్రువీకరించలేదు. కాగా బర్షి దుర్ఘటనకు కేవలం కొన్ని గంటల ముందు, నాసిక్‌కు చెందిన ఇగాత్పురి వద్ద జిందాల్ పాలిథిన్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటనలో ఇద్దరు మరణించగా, మరో 17 మంది గాయపడ్డారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

ఏప్రిల్-నవంబరులో 11శాతంగా నమోదు

న్యూఢిల్లీ: ఈ ఆర్థికసంవత్సరం ఏప్రిల్- నవం బరులో విద్యుత్ లోటు 0.6శాతం మేర పెరుగగా విద్యుత్ డిమాండ్ ఏకంగా 11శాతం పెరిగింది. 2022 ఏప్రిల్-నవంబరులో విద్యుత్ లోటు 5,691 మిలియన్ యూనిట్లు (ఎంయూ)గా ఉంటే అంతకుముందు సంవత్సరం ఇదే సమయానికి అది 4,058 ఎంయూ లుగా ఉన్నదని ప్రభుత్వ డేటా తెలిపింది. సాంకేతిక కారణాలతోనే విద్యుత్ లోటు సంభవిస్తుందన్న అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. భారత్ విద్యుత్ మిగులు దేశం కాగా కొన్నిసార్లు డిస్కమ్‌లు సక్రమంగా పనిచేయలేక పోతున్నాయని, ఇందుకోసం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు నిధుల కొరతే కారణమని వారన్నారు. విద్యుత్ తయారీదారులు 10,12,249 ఎంయూలను ఏప్రిల్-నవంబరులో సరఫరా చేయగా విద్యుత్ డిమాండు 10,17,940 ఎంయూలుగా ఉండటంతో 0.6శాతం లోటు నమోదైంది. అదే విధంగా 2021 ఏప్రిల్-నవంబరులో 9,20,587 ఎంయూలకు డిమాండ్ ఉంటే సరఫరా అయినది 9,16,529 ఎంయూలు కావడంతో 0.4శాతం విద్యుత్ లోటు ఏర్పడింది. 2020-21లో కోవిడ్ కారణంగా మందగించిన వాణిజ్య-పారిశ్రామిక కార్యకలాపాలు పుంజుకున్నాయనేందుకు విద్యుత్ డిమాండ్ పెరగడమే నిదర్శనమని నిపుణులు అన్నారు. 2002 ఏప్రిల్-నవంబరులో విద్యుత్ వినియోగం 10శాతం పెరిగి 10,12,249 ఎంయూలకు చేరింది. అంతకుముందు ఏడాది 9,16,529 ఎంయూల విద్యుత్ వినియోగమైంది. రానున్న రోజుల్లో విద్యుత్ వినియోగం-డిమాండు రెండంకెల వృద్ధిని నమోదు చేస్తాయని నిపుణులు చెప్పారు. విద్యుత్ డిమాండు 2021 డిసెంబరు 183.24జీడబ్ల్యూ కాగా 2022 నవంబులో 187.38జీడబ్ల్యూ కాగా 2022 డిసెంబరులో 202 జీడబ్ల్యూకుపైగా విద్యుత్ రోజువారీ వినియోగమైనట్లు ప్రభుత్వ డేటా చెబుతోంది.

టీమిండియా-2023 బిజీ.. బిజీ...!

ముంబై: ఆసియా కప్, టీ20 ప్రపంచకప్‌ల్లో ఎదురైన పరాభావాలను మర్చిపోతూ కొత్త సంవత్సరంలోకి నూతనోత్సా హంతో అడుగుపెట్టింది టీమిండియా. వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్, వన్డే ప్రపంచకప్, ఆసియా కప్ 2023లో జరగనున్నాయి. ఈసారి ప్రపంచ కప్ టోర్నీకి భారతే ఆతిథ్యం ఇవ్వనుంది. శ్రీలంకతో టీ20 సిరీస్‌తో నూతన సంవత్సరానికి స్వాగతం పలకనుంది భారత్. జనవరి 3 నుంచి స్వదేశంలో ఈ పొట్టి సిరీస్ ప్రారంభంకానుంది.

టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్

జూన్‌లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఉంటుంది. తేదీలు ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతం ఈ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానంలో ఉంది. తొలి రెండు స్థానాల్లో ఉన్న జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. జులై, ఆగస్టు మధ్య టీమిండియా వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ కరేబియన్ జట్టుతో రెండు టెస్టులు (2023-29 డబ్ల్యూటీసీలో భాగం), మూడు వన్డేలు, టీ20లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన మ్యాచ్‌ల తేదీలను ఇంకా ప్రకటించలేదు. సెప్టెంబరులో స్వదేశంలో ఆస్ట్రేలియాతో భారత్ మూడు వన్డేలు ఆడనుంది.

అదే నెలలో ఆసియా కప్ జరగనుండగా.. మ్యాచ్‌ల తేదీలను వెల్లడించలేదు. అక్టోబర్, నవంబర్ మాసాల్లో కీలకమైన వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఆడనుంది. వరల్డ్ కప్ ముగిసిన తర్వాత నవంబర్‌లో భారత్, ఆసీస్ మధ్య ఐదు టీ20లు జరగనున్నాయి. 2023 డిసెంబరు- 2024 జనవరి మధ్య టీమిండియా.. సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఆతిథ్య జట్టుతో రెండు టెస్టులు, మూడేసి వన్డేలు, టీ20లు ఆడనుంది.

శ్రీలంకతో 3 టీ20, వన్డేల సిరీస్

జనవరి 3: తొలి టీ20 - ముంబై
జనవరి 5: రెండో టీ20 - పుణె
జనవరి 7: మూడో టీ20 - రాజ్‌కోట్
జనవరి 10: తొలి వన్డే - గుహవాటి
జనవరి 12: రెండో వన్డే - కోల్‌కతా
జనవరి 15: మూడో వన్డే - తిరువనంతపురం

న్యూజిలాండ్‌తో 3 వన్డేలు, టీ20లు

జనవరి 18: తొలి వన్డే - హైదరాబాద్
జనవరి 21: రెండో వన్డే - రాయ్‌పూర్
జనవరి 24: మూడో వన్డే - ఇండోర్
జనవరి 27: తొలి టీ20 - రాంచీ
జనవరి 29: రెండో టీ20 - లఖ్‌నవూ
ఫిబ్రవరి 01: మూడో టీ20 - అహ్మదాబాద్

భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన

ఫిబ్రవరి: 9-14 తొలి టెస్టు - నాగ్‌పూర్
ఫిబ్రవరి: 17-21 రెండో టెస్టు - ఢిల్లీ
మార్చి: 1-5 మూడో టెస్టు - ధర్మశాల
మార్చి: 9-13 నాలుగో టెస్టు - అహ్మదాబాద్
మార్చి: 17 తొలి వన్డే - ముంబై
మార్చి: 19 రెండో వన్డే - విశాఖపట్నం
మార్చి: 22 మూడో వన్డే - చెన్నై
ఏప్రిల్- మే: ఐపీఎల్ కారణంగా అంతర్జాతీయ మ్యాచ్‌లకు విరామం

ఆకట్టుకుంటున్న 'ఘోస్ట్' మోషన్ పోస్టర్



బెంగళూరు: కరుణడ చక్రవర్తి డా॥ శివరాజ్ కుమార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఘోస్ట్'. హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ప్యాన్ ఇండి యా లెవల్‌లో ఈ సినిమా రూపుదిద్దు కుంటోంది. 'కన్నడ బీర్బల్' వంటి చిత్రానికి దర్శకత్వం వహించి, తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదిం చుకున్న శ్రీని ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ రాజకీయవేత్త సందేశ్ నాగరాజ్ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా 'ఘోస్ట్' టీం రూపొందించిన రెట్రో మోషన్ పోస్టర్‌తో కొత్తసంవత్సరానికి ఆహ్వానం పలికారు. యాక్షన్ థ్రిల్లర్ గా తెరెక్కుతున్న ఘోస్ట్ రెండో షెడ్యూల్ ఇటీవలే మైసూర్‌లో పూర్తి చేసుకుంది. ఈ షెడ్యుల్ లో శివరాజ్ కుమార్, జయరామ్, ప్రశాంత్ నారాయణన్‌ల మీద భారీగా నిర్మించిన ప్రిజన్ ఇంటీరియర్ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మూడో షెడ్యూల్ ఫిబ్రవరి మొదటి వారంలో బెంగళూరు లో వేసిన మరో భారీ సెట్‌లో ప్రారంభమవుతుంది. ఈ షెడ్యుల్‌లో ఇంట్రడక్షన్, క్లైమాక్స్ సన్నివేశాలు షూట్ చేస్తారు. ప్రముఖ మలయాళ నటుడు జయరామ్ ఘోస్ట్‌లో కీలక పాత్ర పోషిస్తుండగా ప్రశాంత్ నారాయణ్, అచ్యుత్ కుమార్, దత్తన్న, అవినాష్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు.



పంత్ స్థానంలో ఎవరు?

ముంబై: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ కోలుకోవడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో అతడు ఫిబ్రవరిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌తో పాటు ఏప్రిల్‌లో మొదలయ్యే ఐపీఎల్‌కు కూడా దూరం అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి పంత్ స్థానంలో మరో ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లను ఎంచుకోవడం ఇప్పుడు సెలెక్షన్ కమిటీకి సవాలుగా మారింది. అయితే ఈ స్థానం కోసం ప్రధానంగా ముగ్గురి మధ్య పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 9 నుంచి ఈ టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. వైట్‌బాల్ స్పెషలిస్టు ఇషాన్ కిషన్‌తోపాటు ఇండియా ఏ కీపర్లు కేఎస్ భరత్, ఉపేంద్ర యాదవ్‌ల పేర్లను కొత్త సెలెక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకోవచ్చు. భరత్, ఉపేంద్రలను నేరుగా జట్టులో స్థానం కల్పించవచ్చు. లేదా డ్యాషింగ్ లెఫ్ట్‌హ్యాండర్ ఇషాన్‌కు అవకాశం ఇవ్వొచ్చు. సాంకేతికంగా చూసుకుంటే.. సెకండ్ కీపర్‌గా ఉన్న భరత్.. నాగ్‌పూర్ టెస్టులో అరగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే.. ఉపేంద్రకు మెరుగైన గణాంకాలు ఉన్నాయి. మంచి కీపింగ్ నైపుణ్యాలతోపాటు 45+ యావరేజ్‌తో అతడు హిట్టర్ కూడా. దీంతో సెలెక్షన్ కమిటీ ఎవరిని ఎంపిక చేసుకుంటుందో చూడాల్సి ఉంది. ఇక పంత్ పరిస్థితి చూసుకుంటే అతడు ఎంత కాలం క్రికెట్‌కు దూరం అవుతాడో తెలియని పరిస్థితి. అతడి నుదుటికి వైద్యులు ప్లాస్టిక్ సర్జరీ చేశారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని ఢిల్లీ క్రికెట్ సంఘం డైరెక్టర్ శ్యామ్ శర్మ చెప్పాడు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ పూల గోపాలరావు గారు
జుజ్జూరు, వీరులపాడు మండలం

కల్మషం లేని మాట, ఎవరికీ తలవంచని నైజం, మీరు నేర్పిన విలువలు, మీ మధుర స్మృతులను స్మరిస్తూ... మీ జ్ఞాపకాలతో మీ పవిత్ర ఆత్మకు సద్గతులు కలగాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తూ...

భార్య : పూల పద్మావతి
కుమారులు: పూల రాంబాబు
PACS అధ్యక్షులు, జుజ్జూరు
పూల పూర్ణచంద్రరావు

తమ్ముడు
పూల ఏడుకొండలు (స్వామి)
తమ్ముడు కుమారుడు
పూల రామకృష్ణ

కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: ది.2-1-2023 సోమవారం జుజ్జూరు గ్రామంలో మా ఇంటి వద్ద జరుగును.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.